News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :139 | ఖమ్మం | శుక్రవారం, జూలై 4, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## హ్యామ్ రోడ్లపై టోల్‌గేట్ల ప్రసక్తే లేదు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హ్యామ్ రోడ్లపై ఎలాంటి అపోహలు వద్దని, ఈ విధానంలో టోల్‌గేట్లను ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్రంలో రోజుకు 10 వేల వాహనాలు ప్రయాణించే రోడ్లను హ్యామ్ విధానంలో ఎంపిక చేశామన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కేంద్రం కృషి



పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, సహాయశాఖ మంత్రి సతీశ్‌చంద్ర దూబేలు అన్నారు. 'మూతపడిన గనుల్లో పచ్చదనం అభివృద్ధి, స్థానికులకు జీవనోపాధి' అనే అంశాలపై సింగరేణి కాలరీస్ కంపెనీ, కోల్ ఇండియా

వివరాలు 2లో..

## నేడు కాంగ్రెస్ 'సామాజిక న్యాయ సమరభేరి'

- హాజరు కానున్న ఖర్గే, రేవంత్, మీనాక్షి, కేసీ వేణుగోపాల్, ఇతర ముఖ్యనేతలు
- పార్టీ బలోపేతం, సామాజిక న్యాయంపై దిశానిర్దేశం చేయనున్న ఏఐసీసీ అధ్యక్షుడు
- ఎల్బీ స్టేడియంలో భారీ ఏర్పాట్లు



తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న 'సామాజిక న్యాయ సమరభేరి' సభకు భారీ ఏర్పాట్లు చేశారు. గ్రామ, మండల కాంగ్రెస్ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షత వహించనుండగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, పీసీసీ కార్యవర్గం, జిల్లా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు నిర్వహిస్తున్న ఈ సభను రాష్ట్ర కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 500 మందిని సమీకరించాలని దిశా నిర్దేశం చేశారు. సభ ఏర్పాట్లను మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్, భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ తరహా సభను మొదటిసారిగా తెలంగాణలోనే ఏర్పాటు చేస్తున్నందున.. ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా విజయవంతం చేయాలని నేతలు భావిస్తున్నారు.

వివరాలు 2లో..



# వచ్చే వందేళ్లకు ప్రణాళిక

- అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ
- ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణ
- మలబార్ బంగారు, వజ్రాభరణాల తయారీ కర్మాగారం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

"ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చేందుకు విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో డిసెంబరు 9న దాన్ని ఆవిష్కరిస్తాం. వచ్చే వందేళ్ల అవసరాలకు సరిపడా ప్రణాళికలు అందులో ఉంటాయి. ప్రపంచ దేశాలతో పోటీపడేలా మహేశ్వరం మండలంలో 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని పారిశ్రామిక వాడలో మలబార్ జెమ్స్ అండ్ జ్యుయలరీ తయారీ కర్మాగారాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...



"హైదరాబాద్... ఐటీ, ఫార్మా, బల్క్‌డ్రగ్ ఉత్పత్తుల్లో దేశంలో మొదటి స్థానంలో ఉంది. మలబార్ గోల్డ్ నగల తయారీ కర్మాగారంతో ఇకపై బంగారు, వజ్రాభరణాల తయారీ, డిజైన్లలోనూ

వివరాలు 2లో..

## "నేను తప్పు చేయలేదు".. సిట్ కస్టడీకి వెళ్తూ జైలు వద్ద చెవిరెడ్డి కేకలు



- లిక్కర్ కేసులో మూడో రోజు సిట్ కస్టడీకి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి
- జైలు నుంచి తరలిస్తుండగా "నేను తప్పు చేయలేదు" అంటూ కేకలు
- తనపై అక్రమంగా కేసులు బనాయించారని ఆరోపణ
- విచారణకు చెవిరెడ్డి సహకరించడం లేదని వార్తలు
- ఆయనతో పాటు వెంకటేష్ నాయుడిని కూడా ప్రశ్నిస్తున్న సిట్

వివరాలు 2లో..

## కరేడు భూముల జోలికొస్తే చూస్తూ ఊరుకోం



- నెల్లూరు జిల్లా కరేడు రైతుల ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు
- ఇండోసోల్ సోలార్ ప్లాంట్ కోసం భూసేకరణపై పీసీసీ చీఫ్ షర్మిల ఆగ్రహం
- గ్రామ సభలు లేకుండా నోటిఫికేషన్ ఇవ్వడం నియంతృత్వ పోకడ అని విమర్శ
- మూడు పంటలు పండే భూములను లాక్కోవద్దని ప్రభుత్వానికి డిమాండ్
- భూసేకరణ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని షర్మిల హెచ్చరిక

వివరాలు 2లో..

## బనకచర్లపై సీఎం సవాల్‌కు హరీశే సిద్ధమా?

- బీసీ రిజర్వేషన్లపై ఖర్గేకు కవిత లేఖ రాయడం విడ్డూరం
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- నేటి 'సామాజిక సమరభేరి' సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు



బనకచర్ల ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్ధమా అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు భారాస ఎమ్మెల్సీ కవిత లేఖ రాయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ తలపెట్టిన సామాజిక న్యాయ సమరభేరి సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులతో కలిసి ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "బనకచర్లపై భారాస నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. గతంలో కేసీఆర్... చంద్రబాబు, జగన్‌లతో చెట్టాపట్టాలేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేస్తామని చెప్పలేదా? మన రాష్ట్ర వాటా విషయంలో రాజీపడి, తెలంగాణ నీటి హక్కులను కాలరాసింది కేసీఆర్, హరీశ్‌రావు కాదా? ఇప్పుడు తప్పంతా కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నట్లు మాట్లాడతారా? కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒత్తిడి తెస్తేనే బనకచర్ల ఆగిందన్న విషయం

వివరాలు 2లో..

# కేసీఆర్‌కు అస్వస్థత.. యశోద ఆసుపత్రిలో చేరిక

- సోడియం స్థాయులు తక్కువగా ఉన్నట్లు ప్రాథమిక పరీక్షల్లో వెల్లడి
- త్వరగా కోలుకోవాలని సీఎం రేవంత్ ఆకాంక్ష

మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ అస్వస్థతకు గురయ్యారు. గురువారం సాయంత్రం సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరారు. గత రెండు రోజులుగా కొంత నీరసంగా ఉండడంతో కేసీఆర్ గురువారం ఆసుపత్రికి వచ్చారు. ఆయనను పరీక్షించిన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ ఎంవీ రావు సూచనతో ఆసుపత్రిలో చేరారు. వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వర్గాలు గురువారం రాత్రి 9.30 సమయంలో బులెటిన్ విడుదల చేశాయి. "నీరసంతో బాధపడుతూ కేసీఆర్ ఆసుపత్రిలో చేరారు. ప్రాథమిక పరీక్షల్లో రక్తంలో షుగర్ స్థాయులు అధికంగా, సోడియం స్థాయులు

వివరాలు 2లో..



### పోలవరం వద్ద గోదావరి ఉగ్రరూపం...

## నీట మునిగిన ఆలయ మార్గం



- ఎగువ వర్షాలతో పోలవరం ప్రాజెక్టు వద్ద పెరుగుతున్న గోదావరి
- 48 గేట్ల ద్వారా లక్ష క్యూసెక్కులకు పైగా నీటి విడుదల
- నీట మునిగిన మహానందీశ్వర ఆలయానికి వెళ్లే దారి
- స్పిల్‌వే ఎగువన 27 మీటర్లు దాటిన నీటిమట్టం
- ముంపునకు గురవుతున్న పోలవరం, గూటాల మధ్య ఇసుక తిన్నెలు

వివరాలు 2లో..

# వచ్చే పదేళ్లకు ప్రణాళిక

అగ్రస్థానంలో నిలవనుంది. తెలుగు రాష్ట్రాల్లోని మన అక్కచెల్లెళ్లు దేశంలోనే అత్యధికంగా బంగారం కొంటున్నారు. ప్రతి శుభకార్యానికి నగలుఉండాలన్న సెంటిమెంటే ఇందుకు కారణం.

**పాలకులు మారినా విధానాలు మారలేదు**

తెలంగాణ ఆవిర్భవించాక పాలకులు మారినా... పరిశ్రమలను ప్రోత్సహించే విధానాల్లో మార్పు రాలేదు. అందుకే హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు గత 30 ఏళ్లుగా పెట్టుబడుల ప్రవాహం ఆగలేదు. జంటనగరాల తర్వాత సైబరాబాద్‌ను చంద్రబాబు, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి అభివృద్ధి చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో మేం మహేశ్వరం మండలంలోని ముచ్చర్ల-బేగరికంచ గ్రామాల మధ్య నాలుగో నగరాన్ని సృష్టిస్తున్నాం. మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి జపాన్, అమెరికా, సింగపూర్, స్విట్జర్లాండ్(దావోస్)లకు వెళ్లినప్పుడు ప్రపంచవ్యాప్తంగా మెరుగైన సౌకర్యాలున్న నగరాలతో పోటీపడాలని నిర్ణయం తీసుకున్నాం. అందుకనుగుణంగానే కార్యాచరణ రూపొందించాం" అని వివరించారు.

**రెండంకెల వృద్ధిరేటు సాధిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర వ్యవధిలోనే 9.8% వృద్ధిరేటు సాధించామని, త్వరలో రెండంకెలను అందుకుంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. "వచ్చే పదేళ్లలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దనున్నాం. ఈమేరకు నూతన పారిశ్రామిక విధానం-2025 రూపకల్పన చేస్తున్నాం. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు 4,200 దరఖాస్తులు రాగా... ఏకగవాక్ష విధానంలో 15 రోజుల వ్యవధిలోనే 98% యూనిట్లకు అనుమతులిచ్చాం. మలబార్ గోల్డ్ యాజమాన్యం తెలంగాణలో ఫర్నిచర్ తయారీ పరిశ్రమను సైతం ప్రారంభించాలి" అని సూచించారు.

**వ్యాపారంతోపాటు సామాజిక సేవ: అహ్మద్**

బంగారు, వజ్రాభరణాల వ్యాపారంతోపాటు తమవంతుగా సామాజిక సేవ చేస్తున్నట్లు మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. "మా సంస్థ ఏటా 4.7 టన్నులకుపైగా బంగారు ఆభరణాలు, 1.8 లక్షల క్యారెట్ల వజ్రాభరణాలను ఉత్పత్తి చేస్తోంది. లాభంలో 5% నిధులను కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఖర్చు చేస్తున్నాం. తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో స్థానికులకు ముందుగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాం" అని వివరించారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఐఏఎస్ అధికారులు సంజయ్‌కుమార్ జైన్, కె.శశాంక, మలబార్ గ్రూప్ సంస్థల ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలాం, ఎండీ(ఇండియా ఆపరేషన్స్) అషర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.కె.నిషాద్, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, కాంగ్రెస్ నేత కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు కాంగ్రెస్ 'సామాజిక న్యాయ సమరభేరి'

- మొదటి పేజి తరువాయి

కాగా గ్రామ, మండల పార్టీ అధ్యక్షులతో కలిపి దాదాపు 40 వేల మంది వరకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా స్టేడియం లోపల భారీ టెంట్లు వేశారు. దాదాపు 220 మంది కూర్చునేలా పెద్ద వేదిక సిద్ధం చేశారు. స్టేడియం లోపల నలుదిక్కులా నాలుగు భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. గ్రామాల నుంచి వచ్చిన వారికి గాంధీభవన్‌లో భోజన ఏర్పాట్లు చేశారు. జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల బాధ్యులు సమన్వయంతో పని చేసి జనసమీకరణ చేసి సభను విజయవంతం చేయాలని పీసీసీ కోరింది. ఈ సభలో సామాజిక న్యాయం అంశంపై ఖర్గే ప్రసంగించనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు.

విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశాలు..

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), పీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాలు జరగనున్నాయి. వీటికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే హాజరుకానున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు పాల్గొంటారు. చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం తదితర అంశాలపై చర్చిస్తారు.

**విమానాశ్రయంలో ఖర్గేకు ఘనస్వాగతం**

దిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు గురువారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌గౌడ్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం అక్కడి సీ లాంజ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఖర్గే పాల్గొన్నారు. జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం ఏర్పాట్లపై ఆరా తీశారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, పి.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఖర్గే భారీ కాన్వాయ్‌తో నగరానికి చేరుకున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కేంద్రం కృషి

- మొదటి పేజి తరువాయి

లిమిటెడ్‌లు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థతో కేంద్ర మంత్రుల సమక్షంలో గురువారం రంగారెడ్డి జిల్లా నందిగామ మం డలం కన్హా శాంతివనంలో అవగాహన ఒప్పందం కుదుర్చు కున్నాయి. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా జరిగిన మైనింగ్‌లలో బొగ్గు తవ్వేసిన 143 గనుల ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకోసం ప్రధాన మంత్రి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూతపడిన గనుల్లో పచ్చదనం పెంచడంతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. గనుల ప్రాంతాల్లోని రైతుల భూముల్లో సారాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కమిటీ సభ్యుడు సంజయ్ సైగల్ తదితరులు పాల్గొన్నారు.

## హ్యామ్ రోడ్లపై టోల్‌గేట్ల ప్రసక్తే లేదు


- మొదటి పేజి తరువాయి

గురువారం హ్యామ్, ఎన్‌హెచ్ రోడ్లపై హైదరాబాద్‌లో సమీక్షించిన అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ... "హ్యామ్ రోడ్లకు 12 నుంచి 14 ప్యాకేజీలలో టెండర్లను ఆహ్వానించాలన్న అంచనాకు వచ్చాం. సీఎంతో మాట్లాడి త్వరలోనే వీటిని ఖరారు చేస్తాం. ఆగస్టు చివరి నాటికి ఒప్పందాలు చేసుకుంటాం. సెప్టెంబరు మొదటి వారంలో పనులను ప్రారంభించి... మూడున్నరేళ్లలో పూర్తి చేస్తాం. ఆర్ఆర్ఆర్‌ను మొదట నాలుగు వరుసల్లో నిర్మించాలని టెండర్లు పిలిచారు. భవిష్యత్తులో ట్రాఫిక్ పెరగనుండడంతో ఆరు వరుసలకు మార్చాలని కేంద్రానికి విన్నవించాం. అందుకే టెండర్లు ఆలస్యం అవుతున్నాయి. ఆర్ఆర్ఆర్ పనులపై త్వరలోనే ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గడ్కరీని కలుస్తాం. రోడ్డు ప్రమాదాల్లో భారత్ ప్రపంచంలోనే తొలి స్థానంలో ఉంది. మన దేశంలో చూస్తే తెలుగు రాష్ట్రాలు ముందున్నాయి. అందుకే రోడ్ల అభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా ఉండేలా చూస్తున్నాం. రోడ్డు భద్రతపై దృష్టి సారించాలని కేంద్ర మంత్రి గడ్కరీ సైతం సూచించారు. భారాస ప్రభుత్వం రోడ్లను పట్టించుకోలేదు" అని ఆరోపించారు.

**కేసీఆర్ సభకొచ్చి తప్పొప్పులను చెప్పాలి...**

ప్రతిపక్ష నేత కేసీఆర్ శాసనసభకొస్తే అన్ని అంశాలను చర్చిస్తామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ... "హరీశ్‌రావు ఎమ్మెల్యే మాత్రమే. కనీసం శాసనపక్ష ఉపనేత కూడా కాదు. సభను నిర్వహించాలని ఆయనెలా చెబుతారు. కేసీఆర్ వస్తే గోదావరి-బనకచర్లతోపాటు వివిధ ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో చర్చించవచ్చు. కేసీఆర్ శాసనసభకు వచ్చి తప్పొప్పులను చెప్పాలి. ప్రతిపక్ష నేతను కలుపుకొని పోయినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం. అందుకే ఆయన వచ్చి సలహాలు, సూచనలివ్వాలి" అని కోరారు.

## ఆ 45 సెకన్ల సమయం మా తలరాతను నిర్ణయించింది... లేకపోతే అణుయుద్ధమే!



'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్ బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులతో పాకిస్థాన్ పై విరుచుకుపడింది. తాజాగా ఈ దాడులపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సలహాదారు రాణా సనావుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో తమ దేశం అణుయుద్ధం అంచు వరకు వెళ్లిందని సనావుల్లా సంచలన విషయాన్ని అంగీకరించారు. భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణి అణ్వాయుధాన్ని మోసుకొస్తోందా లేదా అని నిర్ధారించుకోవడానికి తమ సైన్యానికి కేవలం 30 నుంచి 45 సెకన్ల సమయం మాత్రమే లభించిందని, అదే తమ తలరాతను నిర్దేశించిందని ఆయన ఒక పాకిస్థానీ న్యూస్ ఛానల్‌కు తెలిపారు."భారత్ నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌పై బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించినప్పుడు, దాన్ని విశ్లేషించడానికి మా సైన్యానికి కేవలం 30-45 సెకన్ల సమయం ఉంది. అంత తక్కువ సమయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడమైనా అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి. ఒకవేళ మా వైపు వారు పొరపాటుగా అర్థం చేసుకుని ఉంటే, అది ప్రపంచవ్యాప్త అణుయుద్ధానికి దారితీసేది" అని సనావుల్లా వివరించారు. రావల్పిండిలోని చక్లాలాలో ఉన్న నూర్ ఖాన్ పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన కీలక స్థావరం. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను హతమార్చడంతో భారత్ ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా భారత సైన్యం పాకిస్థాన్‌లోని నూర్ ఖాన్, సర్గోధా, భోలారీ, జాకబాబాద్‌తో సహా పలు వైమానిక స్థావరాలపై దాడులు చేసి రన్‌వేలు, హ్యాంగర్లను ధ్వంసం చేసింది. భారత్ దాడుల తర్వాత, పాకిస్థాన్ సైన్యం డ్రోన్లు, క్షిపణులతో పశ్చిమ భారతదేశంపై దాడికి ప్రయత్నించగా, భారత రక్షణ వ్యవస్థలు వాటిని విజయవంతంగా అడ్డుకున్నాయి. అనంతరం, భారత్ పాకిస్థాన్ భూభాగంలోని కీలక సైనిక లక్ష్యాలను ఛేదించింది. ఇరు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు తీవ్ర స్థాయిలో క్షిపణి, డ్రోన్ దాడులు జరిగిన అనంతరం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.

## "నేను తప్పు చేయలేదు".. సిట్ కస్టడీకి వెళ్తూ జైలు వద్ద చెవిరెడ్డి కేకలు

లిక్కర్ కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని మూడో రోజు విచారణ నిమిత్తం సిట్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. అయితే, జైలు నుంచి ఆయన్ను విచారణకు తరలిస్తున్న సమయంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. "నేను ఏ తప్పు చేయలేదు, నాపై తప్పుడు కేసులు పెట్టారు" అంటూ చెవిరెడ్డి గట్టిగా కేకలు వేయడం అక్కడ కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే, లిక్కర్ కేసుకు సంబంధించి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు వెంకటేష్ నాయుడిని కూడా సిట్ అధికారులు గురువారం కస్టడీకి తీసుకుని ప్రశ్నించనున్నారు. ఈ క్రమంలో వారిని జైలు నుంచి బయటకు తీసుకువస్తుండగా, చెవిరెడ్డి ఒక్కసారిగా తాను నిర్దోషినంటూ నినాదాలు చేశారు. తనను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా, గడిచిన రెండు రోజుల విచారణలో చెవిరెడ్డి నుంచి సిట్ అధికారులకు ఆశించిన స్థాయిలో సహకారం అందలేదని తెలుస్తోంది. అధికారులు అడిగిన ప్రశ్నలకు ఆయన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మూడో రోజు విచారణ కీలకంగా మారింది. కేసులో కీలక సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## పోలవరం వద్ద గోదావరి ఉగ్రరూపం... నీట మునిగిన ఆలయ మార్గం

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ప్రవాహం క్రమంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టు వద్ద నీటిమట్టం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద ఎగువన నీటిమట్టం 27.230 మీటర్లకు చేరగా, దిగువన 18 మీటర్లుగా నమోదైంది. పెరుగుతున్న వరదను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టుకు చెందిన 48 గేట్లను ఎత్తి, స్పిల్‌వే ఛానెల్ ద్వారా 1,13,436 క్యూసెక్కుల మిగులు జలాలను తిరిగి గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఈ వరద ప్రవాహం కారణంగా, మహానందీశ్వర స్వామి ఆలయానికి రాకపోకల కోసం నిర్మించిన రహదారి పూర్తిగా నీట మునిగింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా, పోలవరం, గూటాల గ్రామాల మధ్య ఉన్న ఇసుక తిన్నెలు కూడా క్రమంగా వరద నీటిలో మునిగిపోతున్నాయి. గోదావరికి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

## కరేడు భూముల జోలికొస్తే చూస్తూ ఊరుకోం

నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ కంపెనీ సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణపై ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పచ్చని పొలాలను నాశనం చేసి పరిశ్రమలు పెట్టాలనుకోవడం దారుణమని, కరేడు రైతుల భూముల జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ కంపెనీకి అనుమతులు ఇస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏకంగా ఊరినే ఖాళీ చేయించేలా భూములు కేటాయించాలని చూడటం అన్యాయమని పేర్కొన్నారు. ఈ మేరకు కరేడు రైతులు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

"కరేడు రైతులది బతుకు పోరాటం. ఊరిని చంపి పరిశ్రమ పెడతాం అంటే చూస్తూ ఊరుకునేది లేదు. కరేడు భూములు జోలికొస్తే రైతుల పక్షాన ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. పచ్చటి పొలాల్లో ప్రజా అభిప్రాయం సేకరించకుండా భూ సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గం. ఇది కూటమి ప్రభుత్వ నియంత పోకడకు నిదర్శనం. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండోసోల్ సోలార్ కంపెనీకి 8,458 ఎకరాలు దారాదత్తం చేస్తామనడం ద్రోహం. గత వైసీపీ ప్రభుత్వం షిరిడీ సాయి అనుబంధ కంపెనీకి అనుమతులు ఇస్తే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం భూ సేకరణకు కనీసం గ్రామ సభలు పెట్టలేదు. మూడు పంటలు పండే పచ్చటి పొలాల్లో పరిశ్రమ వద్దంటున్న రైతుల గోడు వినలేదు. ఇండోసోల్ కంపెనీకి అదనంగా భూములు కేటాయించి, ఊరినే ఖాళీ చేయించాలని చూస్తున్నారు. శాంతియుత ఉద్యమం చేసే కరేడు గ్రామ ప్రజలను నిర్బంధించడాన్ని, అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం.

కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. వెంటనే భూసేకరణకు ఇచ్చిన నోటిఫిషన్ ను రద్దు చేయండి. సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై కరేడు గ్రామ ప్రజల అభిప్రాయాన్ని తీసుకోండి. గ్రామ సభలు నిర్వహించండి. రైతుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించండి. పరిశ్రమల ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదు... అలా అని రైతుల శవాల మీద అక్రమంగా భూసేకరణ చేయాలని చూస్తే మాత్రం సహించేది లేదు" అంటూ ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## బనకచర్లపై సీఎం సవాల్‌కు హరీశ్ సిద్ధమా?

- మొదటి పేజి తరువాయి

మాజీ మంత్రి హరీశ్‌రావు గుర్తుంచుకోవాలి. భారాస పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కవిత బీసీల గురించి ఏం చేశారో చెప్పి ఆ తర్వాత రైల్ రోకో చేయాలి. ఖర్గేకు భారాస తరఫున లేఖ రాశారా.. లేక జాగృతి పక్షానా? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించింది నాటి సీఎం కేసీఆర్. రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీని నియమించలేని స్థితిలో భాజపా ఉండటం విచారకరం. 40 వేల మందితో నిర్వహించే సామాజిక న్యాయ సమరభేరి సభలో కాంగ్రెస్ శ్రేణులకు మల్లికార్జున ఖర్గే దిశా నిర్దేశం చేస్తారు" అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో చంద్రబాబు కోవర్టులున్నారంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారని విలేకరులు ప్రస్తావించగా వాటిని పార్టీ సీరియస్‌గా తీసుకుంటుందని ఆయన బదులిచ్చారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుందన్నారు.

## కేసీఆర్‌కు అస్వస్థత.. యశోద ఆసుపత్రిలో చేరిక

- మొదటి పేజి తరువాయి

తక్కువగా ఉన్నట్లు తేలింది. కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉంది. షుగర్, సోడియం సాధారణ స్థాయికి వచ్చే వరకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతారు' అని హెల్త్ బులెటిన్‌లో డాక్టర్ ఎంవీ రావు పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆయనతోపాటు ఉన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. కేసీఆర్ ఆరోగ్యంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. అస్వస్థతతో యశోదలో కేసీఆర్ చేరారన్న సమాచారం తెలిసిన వెంటనే ఆసుపత్రి వైద్యులు, అధికారులతో మాట్లాడారు. కేసీఆర్‌కు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ.. మాజీ సీఎం కేసీఆర్‌కు మెరుగైన వైద్యం అందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.

# ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), జూలై 03,**గురువారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా గురువారం ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు.

ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్ మరియు ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ , పాల్గొన్నారు.

## భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 03,**భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కొత్తగూడెం రైటర్ బస్తీలోని భవిత కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవిత కేంద్రంలో అందుబాటు లో ఉన్న సౌకర్యాలు, నిర్వహణ విధానాలు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముచ్చటించి వారికి అందుతున్న శిక్షణ, కల్పిస్తున్న సౌకర్యాలు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నాను. దివ్యాంగ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్లలో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుగా భవిత కేంద్రాలు ఉపయోగపడుతు న్నాయని,ప్రత్యేక అవసరాలు గల పిల్లల బోధన కోసం అవసరమైన అన్ని పరికరాలు, స్టడీ మెటీరియల్ తెప్పించాలని ఆదేశించారు. రెయిలింగ్, ర్యాంపు రాంప్ వంటివి పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు.

ఫిజియోథెరపిస్టు కచ్చితంగా కేంద్రానికి వచ్చేలా చూడాలని అన్నారు. భవిత కేంద్రంలో విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్ది ప్రత్యేక పాఠశాల నుండి సాధారణ పాఠశాల కు పంపడానికి చేస్తున్న కృషికి సిబ్బందిని అభినందించారు. ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీ స్టేడియంలో జరిగే భారీబహిరంగ సభను విజయవంత చేయండి

- మండల్ కో ఆర్డినేటర్ మల్లారెడ్డి, అధ్యక్షులు వడ్ల నవీన్



**జూలై 03 (సీ కే న్యూస్) చేగుంట** :చేగుంట మండల్ ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు, చెగుంట మండల్ కోర్డినేటర్ మల్లారెడ్డి మాట్లాడుతూ శుక్రవారం జరిగే కాంగ్రెస్ పార్టీ సమావేశం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు కోరారు మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,కూడా శుక్రవారం నాడు జరిగే సభకు బారి ఎత్తున చేగుంట మండల నుండి 30 కార్లతో వెళ్లాలని వారు తెలిపారు ఈ బహిరంగ సభకు, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా రావడం జరుగుతుందని, చేగుంట మండలం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని, సభను జయప్రదం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మసాయి పెట్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ కొండి శ్రీనివాస్,ఎస్సి సెల్ అధ్యక్షులు స్టాలిన్ నర్సింలు, ఎండి మిజామిల్, మండల యూత్ అధ్యక్షులు మోహన్ నాయక్,యూత్ జనరల్ సెక్రటరీ బోయిని శ్రీకాంత్, సినియర్ నాయకులు పూర్ర ఆగం, అశోక్, నాగులు, రాకేష్, కాషాబోయిన మహేష్, రాజు,మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్)జూలై 03,** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్. యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సమావేశం ఈరోజు కొత్తగూడెం పట్టణంలోని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.టి.యూ) కార్యాలయం లో జిల్లా నాయకుడు టీ.అరుణ్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సమావేశంకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ సాంబ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ వేల, కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని, రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ల మీద ఆధారపడి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా కార్పొరేటు, ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరిన విద్యార్థులు ఆర్థికపరంగా మానసిక వేదనను ఎదుర్కొంటున్నారని, దీనిని సాకుగా చూపుతూ విద్యార్థులకు వారి ధ్రువీకరణ పత్రాలను విద్యా సంస్థలు విద్యార్థులకు ఇవ్వడం లేదని, ప్రజా పాలనంటు గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకుని రెండో సంవత్సరం పూర్తి కావస్తున్న విద్యారంగాన్ని కనీస పట్టించుకునే పరిస్థితిలో లేదని, విద్యాశాఖ మంత్రిని కేటాయించ కుండా విద్యాశాఖను తన వద్దనే పెట్టుకున్నా ముఖ్యమంత్రి పెండింగ్ లో ఉన్న రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ల చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడని, అనేక సమస్యల నడుమనే ఈ విద్యా సంవత్సరానికి ప్రారంభించారు అని అటు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర యూనివర్సిటీలపై పెత్తనం కొరకు యూజీసీ నిబంధనలను సడలిస్తు నూతన నిబంధనలను తీసుకొస్తుంది అని, నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగానికి మతం రంగు పుస్తున్నారు అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిరుకరుస్తూ కార్పొరేట్, ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను సమస్యలకు నిలయాలుగా మారుస్తున్నారని, విద్యని పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మార్చే కుట్రే అని, తక్షణమే పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించాలని, ప్రభుత్వ విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జె గణేష్, బి.హరి లాల్ టీ. కవినప్రియ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి,( సాయి కౌశిక్), జూలై 03,** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ వ్యాప్తంగా పారిశుద్ధ్య పనులను వేగవంతంగా చేపట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిపిఐఎం 13వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంసీ కాలనీలో స్థానిక సమస్యల పై సర్వే నిర్వహించారు ఈ సందర్భంగా ఎంసీ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం సైడ్ డ్రైనేజీల సమస్యలపై స్థానికులు సిపిఐఎం బృందం దగ్గర తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఎంపీ నర్సారెడ్డి మాట్లాడుతూ పట్టణ వ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్లపైకి మురుగునీరు చేరుతుందని అన్నారు. నివాస గృహాల మధ్య పిచ్చి చెట్లు పెరిగి అరణ్యాన్ని తలపిస్తూ విషపాములు పురుగులు సంచరిస్తున్నాయని. రోడ్ల మీదికి వచ్చి చేరుతున్న మురుగు నీటిలో దోమలు శరీర విహారం చేస్తూ డెంగ్యూ టైఫాయిడ్ మలేరియా వంటి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం స్పష్టంగా కనబడుతుందని అన్నారు. నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూములలో సైతం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆ నీరు మొత్తం ఏఎంసి కాలనీకి వచ్చి చేరి స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. పంచాయతీ అధికారులు పట్టణవ్యాప్తంగా పారిశుద్ధ్య పనులను వెంటనే చేపట్టాలని లేనిపక్షంలో సిపిఐఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో యు జ్యోతి, అల్లాడి సత్యవతి, చిట్టిబాబు, మోహన్, తదితరులు పాల్గొన్నారు

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సజ్జు భాయ్ నియామకం.



- బీసీ సంఘం కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉంటాను.
- బీసీ సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం.

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 3.**బీసీ సంక్షేమ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వలిగొండ మండలం నాగారం గ్రామానికి చెందిన పంజా సజావర్ అలీ సజ్జు భాయ్ ని నియమిస్తూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య సమక్షంలో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఆలకుంట్ల ఎల్లయ్య గురువారం నాగారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రం అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాలకు న్యాయం జరిగేంత వరకు వివిధ పద్ధతులలో ఉద్యమాలు చేయడమే తమ విధానం అన్నారు,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు న్యాయం చేయడం లేదని 76 ఏళ్ల తర్వాత కూడా చట్టసభలలో వాటా కోసం పోరాడాల్సిన పరిస్థితి ఉందన్నారు, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ సజావుగా జరగాలని అన్నారు, చట్టసభల్లో 50 శాతం వాటా కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని. గ్రామా మండల జిల్లా కమిటీలు వేసి బీసీ సంఘాలను మరింత పటిష్టం చేస్తామన్నారు, తెలంగాణ ఉద్యమం తరహాలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఎల్లయ్య పిలుపునిచ్చారు. పంజా సజ్జు భాయ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్యకు జాతీయ ఉపాధ్యక్షులు ఆలకుంట్ల ఎల్లయ్యకు కృతజ్ఞతలు తెలిపారు, తనపై నమ్మకంతో ఈ పదవి బాధ్యతలు అప్పగించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు, బీసీ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి శాయశక్తుల కృషి చేస్తానని బీసీ కులాల ఐక్యత కోసం బీసీల హక్కుల సాధన కోసం వారి సంక్షేమానికి అభ్యున్నతికి నా వంతుగా కృషి చేస్తానని అన్నారు, ఈ కార్యక్రమంలో మండల నాయకులు బెలిదే నాగేశ్వర్ పోలు నాగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు పుస్తకాల వితరణ



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, (వెంకటేష్)జూలై 03,**ఇల్లందు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థుల కోసం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురువారం పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్టణంలోని మెయిన్ రోడ్ హైస్కూల్, జేబీఎస్ హైస్కూల్లలో ఎంతో ఉత్సాహంగా జరిగింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇల్లందు శాసనసభ్యుడు కోరం కనకయ్య విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని ఆకాంక్షించారు. విద్యార్థుల మంచి భవిష్యత్తు కొరకు ఇటువంటి మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహాసభకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుమారు 120 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.


ఈ కార్యక్రమంలోమాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వర్లు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ధారా రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నాగేష్ కుమార్, ఇల్లందు మండల, పట్టణ, యువజన అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, కండె రమేష్, గౌరిశెట్టి పురుషోత్తం, పల్లెర్ల చంద్రశేఖర్, తాటిపల్లి సుబ్బారావు, యెలుగూరి మల్లికార్జున్, మధుబాబు, సతీష్, ఆనందరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు రవికిరణ్, రాచర్ల వెంకటేశ్వర్లు, బసవయ్య, దివ్వెల నాగేశ్వరరావు, దార ధీరజ్, పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ యార్డ్ చైర్మన్ రాంబాబు, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి : సీపీఎం పార్టీ



**సి కె న్యూస్ ప్రతినిధి:** ఆరెంపుల గ్రామంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆరెంపుల గ్రామం లో అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు కావాలని ఖమ్మం రూరల్ మండలం తహశీల్దార్ రాంప్రసాద్ కు దరఖాస్తు ను అందజేశారు.
స్పందించిన తహశీల్దార్ రాంప్రసాద్
వారం రోజుల్లో అర్హులైన వారిని సర్వే చేసి గుర్తిస్తామని గ్రామం లో ఉన్న ప్రభుత్వ భూములు సీలింగ్ భూములు బాగుచేసి పేదలకు పట్టాల పంపిణీ, స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.
కార్యక్రమంలో సిపిఎం పార్టీ పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు మాజీ జెడ్పిటిసి సభ్యులు పెరుమాళ్ళ పల్లి మోహన్ రావు, ఆరెంపుల సిపిఎం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి వల్లూరు సీతారామరెడ్డి సభ్యులు సాదిక్ అంజద్ మరియు లబ్దిదారులు తాటి రవి వర్మ పేరం భారత్ పెరుమాళ్ళ పల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి, తపస్




**చేగుంట 03 (సీ కే న్యూస్)** చేగుంట మండలంలోని వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడి ని నియమించాలని, నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని, జీవో 317 బాధితులందరికీ న్యాయం చేయాలని, పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పి ఆర్ సి ని ప్రకటించి వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాన్ని వెంటనే చెల్లించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 కింద వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ చేగుంట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగెళ్లపల్లి కృష్ణమూర్తి,జిల్లా ఉపాధ్యక్షురాలు రేఖ,మండల ఉపాధ్యక్షులు మధునాల శ్రీనివాస్,సంగీత, అమరేశ్వరి, మండల కమిటీ సభ్యులు,రాధా, సరస్వతి, సునీత, మంజులత, సంధ్యారాణి, వీణ, సలీం, బంగారయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# మోడల్ స్కూల్ హాస్టల్ లో వంట మనిషి కోసం దరఖాస్తుల స్వీకరణ

**జూలై 3 ( సీ కే న్యూస్) చేగుంట:** చేగుంట మండల్ కేంద్రంలో గల మోడల్ స్కూల్ లో హాస్టల్ లో ఒక హెడ్ కుక్ మరియు ఒక అసిస్టెంట్ కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల వారిని ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించనైనది. ఈ హెడ్ నియామకానికి పదవ తరగతి అర్హత గలవారు మరియు అసిస్టెంట్ కుక్ కి ఏడవ తరగతి అర్హత కలిగిన వారు ఎవరైనా సరే దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఈ నెల జూలై 9 లోపు దరఖాస్తు చేసుకోగలరని స్కూల్ యజమాన్యం ఇంచార్జ్ శ్రీవాణి తెలిపారు. ఆసక్తి కలవారు ఫోన్ నెంబర్ 6300981605 స్వాతి కేర్ టేకర్ ను సంప్రదించగలరు.



# గిరిజన ప్రాంతాల్లో ఔషధ గుణాలు గల మేకపాల ఉత్పత్తి, విక్రయ కేంద్రాల ఏర్పాటు అవసరం.



● కలెక్టర్ జితేష్ వి పాటిల్.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 03,భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖాధికారి, మండల స్థాయి పశు వైద్యాధికారులు, జిల్లా వెటర్నరీ వైద్య సిబ్బంది తో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గిరిజన గ్రామాలలో గిరిజనులు మరియు మహిళల వద్ద ఉన్న మేకల సంతతిని అభివృద్ధి చేసి అధిక పాల దిగుబడి సాధించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మేకపాల విశిష్టతను ప్రజలకు తెలియజేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మేకపాల నుండి పెరుగు, మజ్జిగ, జున్ను, పన్నీరు, చీజ్ వంటి ఉత్పత్తులను తయారు చేసి వినియోగించే పద్ధతులపై గిరిజనులు మరియు మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు.

అదేవిధంగా, మేకపాలను ప్రోత్సహించడం ద్వారా మేకలు అడవుల్లో లభించే ఆకులు, చెట్లు మేతగా తీసుకోవడం వలన అడవులను రక్షించవచ్చని, అడవులు మనలను రక్షిస్తాయని కలెక్టర్ తెలిపారు. మేకల మేత కోసం అవసరమైన మొక్కలను నాటడం ద్వారా అడవుల అభివృద్ధి జరగగలదని, దీని వల్ల గిరిజనులు, మహిళలు, సమాజం మొత్తానికి లాభం చేకూరుతుందని వివరించారు.

జిల్లా ప్రజలకు ఆరోగ్యకరమైన మేకపాలను అందించడానికి ప్రత్యేకంగా మేకపాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వీటి మార్కెటింగ్ ద్వారా గిరిజనులు మరియు మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు.

ఇకపై గిరిజనులు మరియు మహిళలను బాతులు, కౌజు పిట్టల పెంపకంపై కూడా ప్రోత్సహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని, ఈ చర్యల ద్వారా ఆదివాసీ కుటుంబాలు మరియు మహిళలు ఆర్థికంగా లాభపడడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారం పొందగలరని కలెక్టర్ అన్నారు.

ఈ సమావేశంలో డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖాధికారి, మండల స్థాయి పశు వైద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మ కమిటీ చైర్మన్ గా మంగీలాల్ నాయక్

- వాక్చాతుర్యం , చురుకుదనం, నిస్వార్థవంతమైన పనితనానికి
- గుర్తింపుగా ఆత్మ కమిటీ చైర్మన్ పదవి ఖరారు



సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి , (వెంకటేష్)జూలై 03,ఇల్లందు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ గా టేకులపల్లి మండలం గోలియా తండ గ్రామానికి చెందిన బోడా మంగీలాల్ పేరు ను ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య బుధవారం రాత్రి ఖరారు చేశారు. 2013 లో కోరం కనకయ్య నాయకత్వంలో
కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య కు, కాంగ్రెస్ పార్టీకి మంగీలాల్ విధేయుడిగా పనిచేసి, విద్యార్థి దశలో ఎన్ ఎస్ యు ఐ, ఆ తర్వాత యువజన కాంగ్రెస్ లో మంగీలాల్ చురుగ్గా పనిచేశారు, కొంత కాలం పాటుగా టేకులపల్లి మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కూడా చేశారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య కు విధేయుడిగా ఉన్న మంగీలాల్ , తన చురుకుదనం, వాక్చాతుర్యంతో ఇల్లందు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ గా నియమించారు

## బహిరంగ సభ విజయవంతం చేయాలి

పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు



పెబ్బేరు జూలై03 (సి కే న్యూస్)జూలై 04 శుక్రవారం గ్రామ స్థాయి నేతలతో ఏర్పాటు చేసిన ఎల్బీ స్టేడియంలో జరగబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం విలేకరుల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.గ్రామస్థాయి కార్యకర్తలతో నేరుగా మాట్లాడాలనే ఆలోచనతో నిర్వహించ తలపెట్టిన ఖర్గే సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ సభ ద్వారా ప్రతిపక్షాలకు మన బలాన్ని చూపించాలన్నారు.ఈ బహిరంగ సభతోనే రాబోయే ఎన్నికల విజయానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు మోతె రాముడు,రామన్ గౌడ్,నరసింహ్మా నాయుడు,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్,సురేందర్ గౌడ్,రాములు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేత



( సి కే న్యూస్)భారతీయ జనతా పార్టీ చౌటుప్పల మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం చౌటుప్పల మున్సిపల్ పరిధిలోని వలిగొండ రోడ్డులో గల నాలా కల్వర్టును పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక బిజెపి నాయకులు పరిశీలించి, నాలాలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని,తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కడారి కల్పన యాదవ్ మాట్లాడుతూ... నాలాకి ఇరువైపులా నాలాను ఆక్రమిస్తూ ఇటీవల బోరు వేసి నిర్మాణాలు చేయుచున్నారని ఇట్టి స్థలంలో గతంలో అక్రమ నిర్మాణాలు చేయగా అప్పటి కలెక్టర్ ఆదేశాల ప్రకారం తొలగించడం జరిగినదని తెలిపారు . ఇప్పుడు మళ్లీ అదే స్థలంలో నిర్మాణాలు చేయుచున్నందున ఈ వానాకాలంలో అధిక వర్షపాతం నమోదైతే ఊర చెరువులో నుండి వచ్చిన నీరు బయటకు వెళ్లకుండా బ్యాక్ వాటర్ పెరిగి చౌటుప్పల్ పట్టణ ప్రజలకు ప్రమాదం పొంచి ఉన్నదని కావున తక్షణమే ఇట్టి అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని, తగు చర్య తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే చౌటుప్పల్ ఫైర్ స్టేషన్ దగ్గర కొంతమంది గవర్నమెంట్ స్థలం కబ్జా చేసి బోరు వెయ్యడం జరిగిందని ఈ స్థలాన్ని రక్షించవలసిందిగా భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్, దూడల భిక్షం గాచిడ్,రమణ గోని శంకరయ్య,కంచర్ల గోవర్ధన్ రెడ్డి,పోలోజు శ్రీధర్ బాబు, ఉబ్బు బిక్షపతి,కట్ట కృష్ణ, కాసుల వెంకటేశం,గోశిక పురుషోత్తం,వనం ధనంజయ,కడారి ఐలయ్య,ఉష్కాగుల నాగరాజు, పబ్బు వంశీ, గుండబోయిన వేణు, ఓరగంటి భానుప్రకాష్, కానుగు శేఖర్, ఇటుకల దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్.




- విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలుకు సిద్ధం అవ్వండి.
- విద్యా కాషాయీకరణ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం.
- పెండింగ్ స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్మెంట్ పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి.
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / పాల్వంచ ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 03,విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. గురువారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ జిల్లా మహాసభ నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ అరుణ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ బ్రిటిష్ పరాయి పాలకుల చెర నుండి భరతమాత విముక్తి కోసం విద్యార్థులను అందరిని ఒక్క తాటిపైకి తీసుకురావటానికి లక్నో నగరాన బెనారస్ విశ్వ విద్యాలయంలో 1936 ఆగస్టు 12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించిందని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం అనంతరం విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏకైక లక్ష్యంగా ఆనాటి నుండి నేటి వరకు సమరశీల ఉద్యమాలు కొనసాగిస్తున్న ఈ దేశ ప్రథమ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో విద్య ఉపాధి హక్కుల సాధనకై సమరశీల పోరాటాల కు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం వలన పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతుందని కేవలం డబ్బున్న వాడే విద్యను అభ్యసించే రోజులు రాబోతున్నాయని ఇటువంటి విద్యా వ్యతిరేక నూతన విద్యా విధానాన్ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా దళిత గిరిజన మహిళల పై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు సమానమైన విద్యను అందించాలని డిగ్రీలు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్ ( బి ఎన్ ఈ జి ఏ ) అమలు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్షిప్, రియంబర్స్మెంట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల రామకృష్ణ మాట్లాడుతూలి పూర్తిస్థాయి వార్డెన్లు లేక సంక్షేమ హాస్టల్లో సమస్యలతో విలియతాండనం చేస్తున్నాయని సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్యారంగం తీవ్రంగా నష్టపోయిందని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందన సమస్యల నిలయంగా ఉన్నాయని నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
వర్క అజిత్, యు హరీష్, షాహిద్, రణధీర్ అధ్యక్షతన జరిగిన మహాసభలో మాజీ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ చాంద్ పాషా, జిల్లా కార్యదర్శి షేక్ పహీమ్ దాదా, అధ్యక్షుడు జర్పుల ఉపేందర్, గుండాల సుజన, పవన్ సాయి, నాగేంద్ర బాబు, బతుల సాయి, వినయ్, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్ లోకి వలసలు ప్రారంభం

- తెలంగాణ అభివృద్ధి కె.సి. ఆర్ వల్లే సాధ్యం.
- నియోజకవర్గ అభివృద్ధి నిరంజన్ రెడ్డి గారికే సాధ్యం.
- ఉమ్మడి పెబ్బేరు మండలంలో బి.ఆర్.ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు.

పెబ్బేరు మండల్ జూలై /3 ( సి కే న్యూస్) గౌరవ మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారి నాయకత్వములో పెబ్బేరు మండలం యాపర్ల గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు 36మంది మరియు తిప్పాయి పల్లె నుండి 4కాంగ్రెస్ పార్టీ నుండి బి.ఆర్.ఎస్ పార్టీలో చేరారు.వారికి గౌరవ నిరంజన్ రెడ్డి గారు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో రైతు సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాజీ రైతు సంఘం అధ్యక్షుడు మద్దిలేటి,ఖాతాల్,మౌలాలి,భాస్కర్, గుజ్జుల.వెంకటేష్,కావాలి
శ్రీను,వెంకట్రెడ్డి,ప్రవీణ్,జి.శివ,ఈశ్వర్,గిరినందరెడ్డి,బీచ్చుపల్లి,లక్ష్మణ్,ధర్మేంద్ర, బ్బుచన్న,మన్యం కొండ,రాఘవేంద్ర,నరేందర్ రెడ్డి,గోకారి,రవీందర్ గౌడ్,గొల్ల.గట్టన్న,ఈరపోగు నరసింహ,తదితరులు ఉన్నారు.

వీరంతా మండల అధ్యక్షులు వనం రాములు మరియు గ్రామ ముఖ్య నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,డాక్టర్.ఆనంద్,బీసన్న,అలిపిర్ ఆధ్వర్యములో పార్టీలో చేరారు.
కె.సి.ఆర్ సంపద సృష్టించి రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపారు.

ప్రజల జీవనప్రమాణాలు పెరగడానికి కె.సి.ఆర్ శాశ్వత అభివృద్ధి సాధించిచూపారు. సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రివర్యులు.కె.సి.ఆర్ సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్టాన్ని సాధించి తాను కలలు కన్న బంగారు తెలంగాణ దిశగా అభివృద్ధి సాధించినారని గౌరవ నిరంజన్ రెడ్డి కొనియాడారు.ప్రజలు శాశ్వతంగా ఉపాధి పొందేందుకు వ్యవసాయ ఉత్పత్తులు సాధించేందుకు సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచారు.తెలంగాణ వచ్చిన నాడు మూడున్నర కోట్ల ప్రజల తలసరి ఆదాయం 94వేలు ఉంటే కె.సి.ఆర్ గారు 10ఏండ్ల కాలములో ప్రజల తలసరి ఆదాయం 3లక్షల 12వేల రూపాయలకు పెంచారని అన్నారు.

సంపన్న రాష్ట్రాల ఆదాయానికి మించి సంపద సృష్టించి తెలంగాణ రాష్టాన్ని ఆదాయంలో అగ్రభాగాన నిలిపిన ఘనత కె.సి.ఆర్ గారిది అని స్పష్టం చేశారు. కల్వకుర్తి నుండి సింగోటం మీదుగా ఎత్తిపోతల పథకం 150కోట్లతో సాధించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామని అన్నారు పార్టీలో చేరిన వారిని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తూ వారి సేవలు పార్టీ ఉపయోగించుకుంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమములో మండల పార్టీ అధ్యక్షులు వనం.రాములు, కర్రేస్వామి,సత్యారెడ్డి,దిలీప్ రెడ్డి,పెద్దింటి.వెంకటేష్,వడ్డెఈశ్వర్,జగన్నాథం నాయుడు,రాజశేఖర్, ఎల్లారెడ్డి,వేణు బాబు,వడ్డె రమేష్,శేఖర్ గౌడ్,మన్యం,సాయి రెడ్డి,గోవిందు నాయుడు,బాలస్వామి,జూదం.వెంకటేష్,సొప్పరి.బీచ్చుపల్లి,అంజి , వసంత్,వేణు తదితరులు పాల్గొన్నారు.



## ఇటీవల మరణించిన బోళ్ల అంజయ్య కుమారుడు, బోళ్ల శేఖర్ ,18000, వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేత.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 3. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆరూరు గ్రామం లో బోళ్ల అంజయ్య,కుమారుడు బోళ్ల శేఖర్ అనారోగ్యంతో మరణించడం జరిగింది వారి కుటుంబాన్ని పరామర్శించి న,మాజీ ఎంపీపీ చిట్టే డి జనార్దన్ రెడ్డి,5000,రూపాయలు అరూరు,డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ %జ, చీ%, రెడ్డి, 6000 రూపాయలు, తుమ్మల నరసయ్య సేవాసమితి నుండి, 6000,రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బండారి నరసింహ రెడ్డి1000, రు , వలిగొండ మండల ఓబీసీ సెల్, అధ్యక్షుడు చిలకమర్రి కనకాచారి, 500, రు, మాజీ ఎంపిటిసి పోలేపాక చంద్రయ్య, 500 రు, మత్స్యగిరి గుట్ట డైరెక్టర్ బండి రవికుమార్, 1000, రు, బిజెపి గ్రామ శాఖ అధ్యక్షుడు ఆవుల బిక్షపతి,1000, రు,సింగిల్ విండో డైరెక్టర్ ఆవుల, స్వామి,1000, రు, ఆవుల సత్యనారాయణ, 1000, రు, ఓరుగంటి రామచంద్రం,1000, రు మాజీ సర్పంచ్ పోలేపాక చెమ్మయ్య, బోగారం దాసు, ఉదేశ్, తదితరులు పాల్గొన్నారు

## జులై 5 న జూలూరుపాడు లో జరిగే ఏఐవైఎఫ్ జిల్లా 2 వ మహాసభను జయప్రదం చేయండి.

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కె నాగుల్ మీరా.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 03,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం పట్టణంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండవ మహాసభ జూలూరుపాడు లో ఈ నెల జూలై 5 న జరిగే మహాసభను జయప్రదం చేయాల ని కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం నిర్వహించిన జిల్లా కార్యదర్శి ఎస్కె నాగుల్ మీరా.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐవైఎఫ్ 1959 మే 3 న ఆవిర్భవించిందని దేశం కోసం ప్రాణాలర్పన చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు లాంటి అమర వీరుల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని యువజన హక్కుల సాధనకై సామాజిక అభివృద్ధికై పాటుపడుతూ యువజన ఉద్యమాలను ముందుకు కొనసాగుతుందన్నారు.
ఈ మహాసభల్లో ప్రధాన డిమాండ్లు :
1) జిల్లాలో పరిశ్రమలలో స్థానిక యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని.
2) నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 5000 /-రూపాయలు తక్షణమే ఇవ్వాలని.
3) డ్రగ్స్ మత్తు పదార్థాలు విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని.
4) రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని.
తదితర డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని తయారు చేయడం జరిగిందన్నారు.
ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ఖయ్యూమ్, ఏఐవైఎఫ్ పట్టణ నాయకులు గోపి, దిలీప్, భానోత్ శ్రీను, రసూల్, జావిద్, రవి,ఉదయ్, వెంకట్, రోహిత్, శ్రీకాంత్, హరీష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- బట్టసంచులు వాడి పర్యావరణాన్ని రక్షించాలి
- అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవ ర్యాలీ
- మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి




**చౌటుప్పల్.జులై 03. సి కే న్యూస్** ప్రస్తుతం ప్రపంచాన్ని పీడిస్తున్న పర్యావరణ సమస్యల్లో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటని, ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్ పురపాలక సంఘం కార్యాలయంలో
ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే ర్యాలీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు
ట్రినిటీ స్కూల్ విద్యార్థుల భాగస్వామ్యంతో కలిసి ర్యాలీ నిర్వహించారు. "ప్లాస్టిక్ ను వాడకూడదు ప్రాణాలను తీయకూడదు" అని విద్యార్థులు నినాదిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ..
ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి
ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నారు.అందరూ బట్ట సంచులు వాడి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. ప్లాస్టిక్ వల్ల జీవులు నష్టపోవడమే కాక, జీవవైవిద్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని విద్యార్థులకు తెలిపారు. భావి భారత పౌరులైన విద్యార్థులు ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని వారి తల్లిదండ్రులకు, బంధువులకు, స్నేహితులకు,చుట్టూ ప్రక్కల వారికి తెలియజేయాలన్నారు. నిత్యజీవితంలో మానవుడు తనకు తెలియకుండానే సుమారు ఎనిమిది కేజీల ప్లాస్టిక్ ని వివిధ రూపాల్లో తినడం జరుగుతుందని తద్వారా ఊహించని జబ్బులు, క్యాన్సర్లు వస్తున్నాయన్నారు. మానవుడు సంతోషంగా, ఆరోగ్యమైన జీవితం కొనసాగించాలంటే ప్లాస్టిక్ ను శాశ్వతంగా నివారించాలన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ టి.రఘుపతి, మున్సిపల్ సిబ్బంది, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, టీఎంసీ కవిత, పారిశుధ్య కార్మికులు, ట్రినిటీ స్కూల్ చైర్మన్ కెవిపి కృష్ణారావు, ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

# సిగచీ యాజమాన్యం నిర్లక్ష్యం వలన ప్రాణాలు కోల్పోయిన కార్మికులు



**పటాన్చెరు జులై 03: సి కే న్యూస్** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగచీ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వలన బీద కార్మికులు ప్రాణాలు కోల్పోయారని, చాలామంది కార్మికులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సరైన భద్రత ప్రమాణాలను పాటించకపోవడం, భద్రత యంత్రాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల ఈ ఘోరమైన ప్రమాదం జరిగిందని పరిశ్రమ యజమానంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, చనిపోయిన వారి కుటుంబానికి 2 కోట్లు చికిత్స పొందుతున్న వారికి 1 కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, పక్క ఇండ్లు నిర్మించి ఇవ్వాలని పరిశ్రమ యజమాన్యాన్ని మరియు ప్రభుత్వాన్ని...
ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మ్యాతరీ మహేందర్ మహారాజ్ డిమాండ్ చేసారు మరియు హాస్పిటల్లో ఉన్న క్షతగాత్రూలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యాన్ని చెప్పి అండగా ఉంటామని తెలపడం జరిగింది పాల్గొన్నవారు జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, ధనరాజ్, విష్ణువర్ధన్, సుదర్శపాల్గొన్న డి ఎస్ యు నాయకులు అఖిల్ పాల్గొన్నారు

# సీపీఐ మహాసభ కరపత్రావిష్కరణ

**చౌటుప్పల్. జులై 3. సి కే న్యూస్** సిపిఐ చౌటుప్పల్ మండల 7 వ మహాసభ ను జయప్రదం చేయలని కోరుతూ గురువారం కరపత్రావిష్కరణ చేశారు. సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య మాట్లాడుతూ..
ఈ నెల 13వ తేదీన చౌటుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించే సీపీఐ చౌటుప్పల్ మండల 7వ మహాసభకు పార్టీ కార్యకర్తలు,నాయకులు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని,అనేక ప్రజాపోరాటాలు త్యాగాలు చేసిన సీపీఐ పార్టీ ఎన్నో ఒడిదుకులను ఎదుర్కొని నిలబడ్డ పార్టీ సీపీఐ అన్నారు.ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు పార్టీలకు అతీతంగా పనిచేయాలని, అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇల్లు,రేషన్ కార్డులను మంజూరు చేయాలని అన్నారు.చౌటుప్పల్ మండలంలో ఉన్న ప్రజాసమస్యల పరిష్కారం కోసం



సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాపోరాటాలు నిర్వహిస్తమన్నారు.ఈ కార్యక్రమంలో టి.ఎస్. పి. ఎన్.ఎం రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, పిల్లి శంకర్, ఉడుత రామలింగం, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, టంగుటూరు రాములు, రొండి నరసింహ,బద్దుల సుధాకర్,బోయ మంకులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా

**చౌటుప్పల్.జులై 03. సి కే న్యూస్** మోడీ ప్రభుత్వం 2019, 2020 లోనే 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోర్టులను తెచ్చినప్పటికీ కార్మిక వర్గ ప్రతిఘటన వలన వాటి అమలుకు నోచుకోలేదని, ఈ నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని జులై 9న జరిగి దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎండి పాషా పిలుపునిచ్చారు. గురువారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడున్నర దశబ్దాలలో కేంద్రంలో పాలకవర్గాలు కార్మిక హక్కులపై ఏదో ఒక స్థాయిలో దాడి చేస్తూనే ఉన్నాయన్నారు.1991 నుండి ఇప్పటివరకు దేశంలో కార్మిక వర్గం 21 సార్వత్రిక సమ్మెలతో సహా అనేక ఉద్యమాలు చేశాయని గుర్తు చేశారు. ఇప్పుడు ఉన్న కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామికంగా తెచ్చిన నాలుగు లేబర్



కోడుల రద్దుకై జూలై 9న కార్మిక వర్గం మరో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. ఈ సమ్మెను జయప్రదం చేయాలని చౌటుప్పల్ మున్సిపాలిటీలో కార్మికుల అడ్డాల వద్ద బుక్లెట్లు, సమ్మె నోటీసులు, కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బత్తుల దాసు, నాయకులు కలకుంట్ల శివకుమార్, గుణముని రాములు, నెళికంటి నరసింహ, పస్తం ఎల్లప్ప, దశరథ, రంగారెడ్డి, చెరుకు అశోక్, లక్ష్మి, లావణ్య, బి.దుర్గయ్య, ఎండి అనీఫ్,ఉప్పు అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామీణ బ్యాంకు యాచారం శాఖ లో 2లక్షల బీమా అందజేత



**యాచారం జులై 03 సి కే న్యూస్ :**యాచారం మండల పరిధిలోని మల్కిజ్ గూడ గ్రామానికి చెందినరెడ్డమోని వెంకటేష్ అనే వ్యక్తి యాచారం లో పాస్ట్ ఫుడ్ సెంటర్ నడిపించేవాడు. అతను ఇటీవల గుండె పోటు తో మరణించాడు.ఆయన తెలంగాణ గ్రామీణ బ్యాంకు యాచారం శాఖ లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన క్రింద 436/- ఇన్సూరెన్స్ కట్టుకున్నాడు. అట్టి ఇన్సూరెన్స్ డబ్బులు నామిని అయినా ఆయన యొక్క భార్య పద్మ గారికి మేనేజర్ అందచేశారు.ఈ సందర్భంగా మేనేజర్ అందరు ఈ యొక్క బీమా అందరు కలిగి ఉండాలని మాట్లాడారు.

# సిగచీ యాజమాన్యం నిర్లక్ష్యం వలన ప్రాణాలు కోల్పోయిన కార్మికులు

**పటాన్చెరు జులై 03: సి కే న్యూస్** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగచీ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వలన బీద కార్మికులు ప్రాణాలు కోల్పోయారని, చాలామంది కార్మికులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సరైన భద్రత ప్రమాణాలను పాటించకపోవడం, భద్రత యంత్రాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల ఈ ఘోరమైన ప్రమాదం జరిగిందని పరిశ్రమ యజమానంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, చనిపోయిన వారి కుటుంబానికి 2 కోట్లు చికిత్స పొందుతున్న వారికి 1 కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, పక్క ఇండ్లు నిర్మించి ఇవ్వాలని పరిశ్రమ యజమాన్యాన్ని మరియు ప్రభుత్వాన్ని...
ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మ్యాతరీ మహేందర్ మహారాజ్ డిమాండ్ చేసారు మరియు హాస్పిటల్లో ఉన్న క్షతగాత్రూలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యాన్ని చెప్పి అండగా ఉంటామని తెలపడం జరిగింది
పాల్గొన్నవారు జిల్లా కమిటీ సభ్యులు
శ్రీనివాస్, ధనరాజ్, విష్ణువర్ధన్, సుదర్శపాల్గొన్న డి ఎస్ యు నాయకులు అఖిల్ పాల్గొన్నారు

# మిత్రుల జ్ఞాపకార్ధంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

**నర్సింహులపేట, సి కే న్యూస్** నర్సింహులపేట మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మహి మెమోరియల్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహి మెమోరియల్ యూత్ సభ్యులు మాట్లాడుతూ.. మిత్రులు రహీం పాషా, శ్రావణ్ కుమార్ జ్ఞాపకార్థంగా నోట్ పుస్తకాలు, పెన్నులను ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు శ్రావణ్ తల్లి జయప్రద చేతుల మీదిగా పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని అందరి మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, మహి మెమోరియల్ యూత్ అధ్యక్షుడు ఉపేంద్రచారి, ఉపాధ్యక్షుడు జోగి ఉమేష్, యూత్ సభ్యులు గంగాధరి సురేష్, మాచర్ల రవి, రమేష్, యాకన్న, నాగార్జున్, సంపత్, సైదుషన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ క్రీడలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు



**పెబ్బేర్: సి కే న్యూస్** బుదవారం గోపాల్ పేటలో వనపర్తి ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగినటువంటి అండర్ 15 బాలికల ఫుట్ బాల్ క్రీడా విభాగంలో పెబ్బేరు మోడల్ స్కూల్ చెందినటువంటి రాజేశ్వరి, మోక్ష ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 9వ తేదీ నుండి 12వ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలో జరగబోయేటువంటి రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ క్రీడలకు వనపర్తి జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించబోతున్నారు.ధర్మ తేజ ఇటీవల నిజామాబాద్ జిల్లాలో జరిగిన బాలుర విభాగంలో రాష్ట్రస్థాయిలో పాల్గొన్నారు.వీరిని ప్రిన్సిపల్ తూర్పింటి నరేశ్ కుమార్,ఫిజికల్ డైరెక్టర్ కమలాకర్,అధ్యాపకులు బుచ్చయ్య,మంగమ్మ,హేమలత,సాహిత్య,హాఫీజ్ అధ్యాపక బృందం వీరిని అభినందించారు.


# మున్సిపల్ కమిషనర్ ను కలిసిన సిపిఐ నాయకులు



**చౌటుప్పల్. జులై 3. సి కే న్యూస్** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ నూతన మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన గుత్తా వెంకట్రాంరెడ్డిని సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సిపిఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు .
ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని పలు సమస్యల్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి సిపిఐ నాయకులు తీసుకొచ్చారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి,మున్సిపల్ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, పిల్లి శంకర్,ఉడుత రామలింగం,ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, టంగుటూరు రాములు, రొండి నరసింహ,బద్దుల సుధాకర్,బోయ మంకులు పాల్గొన్నారు.

### సింగయ్య భార్యను బెదిరించారు..

# చంద్రబాబు సీరియస్



వైసీపీ కార్యకర్త సింగయ్య మరణం రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది. గత నెల 18న మాజీ సీఎం జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా గుంటూరు బైపాస్ లోని ఏటుకూరు వద్ద సింగయ్య అనే వ్యక్తి కారు కింద పడి మరణించిన విషయం తెలిసిందే. మాజీ సీఎం జగన్ పై పూలు జల్లేందుకు వెళ్లిన సింగయ్య ఆయన కారు కింద పడి మరణించినట్లు ప్రభుత్వం వీడియోలు విడుదల చేసింది. దీనిపై తమకు అనుమానాలు ఉన్నట్లు మృతుడి భార్య లూర్దు మేరి ప్రకటన చేశారు. అయితే ఆమె అలా మాట్లాడటానికి మాజీ సీఎం జగనే కారణమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.సింగయ్య మరణించి దాదాపు 15 రోజులు గడుస్తున్నా, ఆయన మృతికి కారణమైన ప్రమాదంపై రాజకీయ రగడ కొనసాగుతూనే ఉంది. తొలుత ప్రభుత్వం విడుదల చేసిన వీడియోలు ఏఐ జనరేటెడ్ వీడియోలు అని వైసీపీ సందేహం వ్యక్తం చేసింది. తాజాగా మృతుడి కుటుంబ సభ్యులతో మాజీ ముఖ్యమంత్రి జగన్ భేటీ అయ్యారు. తాడేపల్లిలో తన నివాసానికి బాధితులను రప్పించుకున్న జగన్ పరామర్శించారు.పార్టీ అధినేత జగన్ ను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన సింగయ్య భార్య లూర్దు మేరి సంచలన ఆరోపణలు చేశారు. తన భర్త మరణంపై తనకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. మంత్రి లోకేశ్ మనుషులు తమ ఇంటికి వచ్చి తాము చెప్పమన్నట్లు చెప్పాలని ఒత్తిడి చేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా తాము జగన్ అభిమానులమని, ఆయన తమకు అండగా ఉంటారని చెప్పారు. కారు కింద పడిన సింగయ్యకు చిన్నచిన్న గాయాలే తగిలాయని, అంబులెన్సులోనే ఏదో జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు.ఇక సింగయ్య భార్య వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబు గురువారం ఉదయం మీడియాతో మాట్లాడారు. సింగయ్య భార్యను పిలిపించి బెదిరించి రాజకీయం చేయాలని చూస్తారా? అంటూ చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమీ చేయలేని వాళ్లే శవ రాజకీయాలు చేస్తుంటారని ఆరోపించారు. తప్పుడు ప్రచారాలు తాత్కాలికం.. చేసిన పనులే శాశ్వతమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కారు కింద పడిన వ్యక్తిని కుక్కపిల్ల మాదిరిగా పక్కన పడేసి వెళ్తారా? అంటూ ప్రశ్నించారు. కంప చెట్లలో పడేసి వెళ్లారంటే మానవత్వం ఉందా? అని ప్రశ్నిస్తున్నా.. కనీస బాధ్యత లేకుండా ప్రవర్తిస్తారా? అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# ఇంటింటికి టీడీపీ, వైసీపీ.. ఎక్కడ ఏం జరుగుతోంది?



ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ప్రజల బాట పట్టాయి. ఎన్నికలు జరిగి ఏడాది కావడంతో ప్రభుత్వంలో ప్రధాన భాగస్వామి అయిన టీడీపీ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇదే సమయంలో విపక్ష వైసీపీ'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ రెండు కార్యక్రమాల ద్వారా ఆయా పార్టీలు ఇంటింటికి వెళ్లాలనేది ముఖ్య ఉద్దేశం. ఏడాది విజయాలు చెప్పుకోవాలని టీడీపీ.. ఈ ఏడాదిలో హామీలు అమలు చేయలేదని వైసీపీ ప్రచారం చేయాలని నిర్ణయించాయి. సుమారు నెల రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలి మూడు రోజులు ఎలా జరిగింది? అన్న విషయమై ప్రజలు ఆరా తీస్తున్నారు.టీడీపీ చేపట్టిన 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో 'తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. మంత్రి నారా లోకేశ్ తన నియోజకవర్గం పరిధిలోని తాడేపల్లిలో పర్యటించారు. అదేవిధంగా క్యాబినెట్ లో ఉన్న టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా ఈ కార్యక్రమాన్ని 2వ తేదీన ప్రారంభించారు. విదేశీ పర్యటనకు వెళ్లిన కొందరు ఎమ్మెల్యేలు తమ పర్యటనను రద్దు చేసుకుని నియోజకవర్గాలకు వచ్చి, 'తొలి అడుగు' నిర్వహించారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించడంతోపాటు పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టి, అభివృద్ధి పనులను వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో రాత్రి 11 గంటల వరకు పర్యటించారు. అదేవిధంగా మంత్రి లోకేశ్ తాడేపల్లిలోని మహానాడు కాలనీలో ఇంటింటికి వెళ్లారు. ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు మహిళలు, పిల్లలు పోటీ పడ్డారు. మరోవైపు కూటమిలో భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జనసేన ఎక్కడ కూడా 'తొలి అడుగు' కార్యక్రమంలో కనిపించలేదు. ఈ కార్యక్రమం పూర్తిగా టీడీపీ ఆధ్వర్యంలోనే జరుగుతుండటంతో అధికార వర్గాలు కూడా హాజరుకాలేదు.ఇదే సమయంలో 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' నిర్వహించాలని వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. గత నెల నిర్వహించిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కింద వైసీపీ శ్రేణులు ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వివరించాలని సూచించారు. దీని కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్ ను రూపొందించి వైసీపీ శ్రేణులకు అందజేశారు. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చంద్రబాబు ఇచ్చిన హామీలు వస్తాయని, ప్రజలు ఏ విధంగా మోసపోయారో గుర్తు చేయొచ్చని తెలిపారు.ఐదు దశల్లో ఈ కార్యక్రమం నిర్వహించాల్సివుండగా, అధినేత జగన్ చెప్పినట్లు గ్రామస్థాయిలో ఎక్కడా ఈ కార్యక్రమం ప్రారంభించిన సూచనలు కనిపించలేదు. అధినేత జగన్ సైతం బుధవారం రోజంతా తాడేపల్లిలోని తన నివాసంలోనే గడిపారు. ఇక మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఎవరూ క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు వైసీపీ ప్రకటించలేదు. అయితే ఇదే సమయంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి సమావేశాలు మాత్రం నిర్వహిస్తున్నారు. అయితే టీడీపీ ఎమ్మెల్యేలు కన్నా ముందే ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల హామీలు గుర్తుచేయాలన్న అధినేత జగన్ ఆదేశాలు మాత్రం ఇంకా అమలు కాలేదు. అయితే కార్యక్రమ నిర్వహణకు నెల రోజుల వ్యవధి విధించడమే వైసీపీ శ్రేణులు ఇంకా కదలలేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# షికాగో ఆల్బమ్ పార్టీలో మారణ హోమం: నలుగురు మృతి



అమెరికాలోని షికాగో నగరంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన కాల్పులు తీవ్ర కలకలం రేపాయి. ఈ దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. షికాగో పోలీసుల ప్రాథమిక నివేదిక ప్రకారం, మృతులలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు.

**పార్టీలో మారణహోమం**

ఈ దారుణ ఘటన చికాగోలోని రివర్ నార్త్ ప్రాంతంలో ఉన్న ఒక రెస్టారెంట్ దగ్గర జరిగిన ఓ ఆల్బమ్ రిలీజ్ పార్టీ సమయంలో చోటుచేసుకుంది. పార్టీకి సంబంధించిన లాంజ్‌లో ఉన్న వారిపై ఓ గుర్తు తెలియని దుండగుడు తుపాకీతో కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు.

**బాధితుల వివరాలు**

కాల్పులకు గురైనవారిలో 13 మంది మహిళలు, ఐదుగురు పురుషులు ఉన్నారు. మృతుల వయస్సు 21 నుంచి 32 సంవత్సరాల మధ్యగా ఉందని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. బాధితులను సమీపంలోని ఆసుపత్రులకు తక్షణమే తరలించి చికిత్స అందిస్తున్నారు.

**దర్యాప్తు ప్రారంభం**

పోలీసులు కేసును పరిశీలిస్తూ దుండగుడి కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ దాడి కారణాలు, దాని వెనుక ఉన్న ఉద్దేశ్యాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# వియన్నాలో ఆగిపోయిన ఎయిరిండియా విమానం.. కారణం ఇదే!



జపాన్ నుండి ఢిల్లీకి బయలుదేరిన ఎయిరిండియా విమానం ఏఐ 357.. పలు సమస్యల కారణంగా ముందుజాగ్రత్తగా కోల్ కతాకు మళ్లించి సేఫ్ ల్యాండ్ చేయబడిన సంగతి తెలిసిందే. దీంతో.. ఈ విమానం టోక్యోలోని హనేడా విమానాశ్రయం నుండి న్యూఢిల్లీ విమానాశ్రయానికి వెళుతుండగా.. సాంకేతిక సమస్యను సిబ్బంది నివేదించారు.ఇదే సమయంలో... జూన్ 27న ముంబై నుండి చెన్నైకి బయలుదేరిన ఎయిరిండియా విమానం ఏఐ639.. క్యాబిన్ లోపల మండుతున్న వాసనను సిబ్బంది గుర్తించిన తర్వాత టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ముంబైకి తిరిగి రావాల్సి వచ్చింది! ఈ సమయంలో తాజాగా... ఢిల్లీ నుంచి బయలుదేరిన మరో విమానాన్ని అత్యవసరంగా మధ్యలోనే ఆపేశారు!అవును... బుధవారం తెల్లవారుజామున 12:45 గంటలకు బయలుదేరి గురువారం రాత్రి 8:45 గంటలకు వాషింగ్టన్, డీసీ చేరుకోవాల్సిన ఏఐ103 విమానం రద్దు చేయబడింది. ఇందులో భాగంగా.. సాంకేతిక లోపంతో వియన్నాలో ఆపేసి, క్యాన్సిల్ చేశారు! ఫలితంగా... వాషింగ్టన్, డీసీ నుండి వియన్నా మీదుగా ఢిల్లీకి వెళ్లే ఏఐ104 విమానం కూడా రద్దు చేయబడింది.ఈ సందర్భంగా స్పందించిన ఎయిరిండియా ప్రతినిధి ఒకరు... జూలై 2 – 2025న ఢిల్లీ నుండి వాషింగ్టన్, డీసీ వెళ్లే ఏఐ 103 విమానం వియన్నాలో ప్రణాళికాబద్ధమైన ఇంధన స్టాప్ ను ఏర్పాటు చేసిందని.. సాధారణ విమాన తనిఖీల సమయంలో, అదనపు మెయింటినెన్స్ పనిని గుర్తించారని.. దీనిని నెక్స్ట్ ఫ్లైట్ కంటే ముందు సరిదిద్దడానికి అదనపు సమయం అవసరం అని తెలిపారు!దీని కారణంగా.. వియన్నా నుండి వాషింగ్టన్, డిసికి వెళ్లే విమానం రద్దు చేయబడింది.. ప్రయాణీకులను దింపేశారు. ఈ సందర్భంగా... ఈ అసౌకర్యానికి తీవ్రంగా చింతిస్తున్నామని.. ప్రయాణీకులందరి భద్రతతో పాటు సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని ఎయిర్ లైన్ తెలిపింది.ఇదే సమయంలో... వీసా రహిత ప్రవేశానికి అర్హత ఉన్న ప్రయాణీకులకు లేదా చెల్లుబాటు అయ్యే స్కెంజెన్ వీసాలు ఉన్నవారికి నెక్స్ట్ విమానం అందుబాటులోకి వచ్చే వరకు వియన్నాలో హోటల్ వసతి కల్పించబడిందని తెలిపింది. ప్రవేశ అనుమతి లేని వారికి.. ఆస్ట్రియన్ అధికారులతో మాట్లాడి ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేయబడ్డాయని తెలిపింది!

# చైనా అధ్యక్షుడ్ని మార్చడం సాధ్యమేనా?



ప్రపంచ రాజకీయాల్లో చైనా ఒక కీలక పాత్ర పోషిస్తున్న దేశం. ఆ దేశాన్ని పాలిస్తున్న వ్యక్తి జీ జిన్ పింగ్ అయితే, ఇప్పుడు ఆయన కనిపించడం లేదు. అంతర్జాతీయ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం జిన్ పింగ్ ఇటీవల జరిగిన కొన్ని ముఖ్యమైన సమావేశాలకు హాజరుకాలేదు. ముఖ్యంగా బ్రిక్స్ సమావేశానికి ఆయన ప్రత్యక్షంగా హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో ఆయన ఆరోగ్యం, గుట్టుచప్పుడు కాకుండా నాయకత్వ మార్పు జరుగుతోందా అన్న చర్చలకు బలమవుతోంది.

**చైనాలో పాలన ఎలా ఉంటుంది?**

చైనా ప్రజాస్వామ్య దేశం కాదు. కానీ ఓ నియంతృత్వ పాలన కూడా కాదు. అక్కడ "ఏకపక్ష పాలన" ఉంది. కమ్యూనిస్టు పార్టీ ఆదేశమే చైనాలో శాసనం. పార్టీకి చెందిన పాలక వర్గమే అన్ని అధికారాలను నిర్వర్తిస్తుంది. మిలటరీ కూడా ప్రభుత్వానికి కాదని, కమ్యూనిస్టు పార్టీకి కట్టుబడి ఉంటుంది. దీన్ని "పార్టీ మిలటరీ" అంటారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత అయిన జీ జిన్ పింగ్‌కు అపారమైన అధికారాలు ఉన్నాయి.

**జీవితాంతం అధ్యక్షుడిగా?**

2018లో చైనా రాజ్యాంగంలో చేసిన మార్పుతో అధ్యక్ష పదవికి గడువు పరిమితి తొలగించబడింది. దీంతో జిన్ పింగ్ జీవితాంతం అధ్యక్షుడిగా కొనసాగే వీలుకలిగింది. ఈ నిర్ణయం ద్వారా ఆయన అధికారాన్ని మరింత బలపరిచారు. పార్టీపై పూర్తి పట్టు సాధించిన జిన్ పింగ్‌కు వ్యతిరేకులు పార్టీ లోపల కనబడడమే లేదు. ఆయన నిర్ణయమే తుదినిర్ణయం.

**పదవి కోల్పోవడం అంత తేలిక కాదు**

చైనా వంటి ఒక గట్టి రాజకీయ వ్యవస్థలో, అది కూడా జీ జిన్ పింగ్ వంటి నాయకుడి హయాంలో అధ్యక్షుడిని మారుస్తామంటే అది సాధారణ విషయం కాదు. పార్టీ చీఫ్, సైనికాధ్యక్షుడు, రాష్ట్రపతి.. ఈ మూడు హోదాలు కలిసే ఒకే వ్యక్తిలో ఉంటాయి. అతన్ని పదవి నుంచి తొలగించాలంటే, పార్టీ అగ్రనాయకత్వమే తిరుగుబాటు చేయాలి. అలాంటి పరిస్థితులు ఇప్పటికైతే కనిపించట్లేదు.

**జిన్ పింగ్ అసలు ఎక్కడ?**

ఇంతకీ జిన్ పింగ్ ఎక్కడ? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇంకా బయటకు రాలేదు. గతంలోనూ ఆయన కొన్ని వారాల పాటు కనిపించకుండా ఉండిన సందర్భాలు ఉన్నాయి. తర్వాత తిరిగి ప్రత్యక్షమయ్యారు. ఇప్పుడు కూడా ఆయన మళ్లీ బయటపడతారని చాలామంది విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అంతర్జాతీయ మీడియాలో "వాంగ్ యంగ్" అనే నాయకుడిని జిన్ పింగ్ స్థానంలో పెట్టే ఆలోచన జరుగుతోందని కథనాలు వస్తుండటం మాత్రం ఆసక్తికరం.

చైనా అధ్యక్షుడిని మార్చడం, అది కూడా జిన్ పింగ్ లాంటి పవర్ ఫుల్ నాయకుడిని తొలగించడం అంత సులువు కాదు. కానీ రాజకీయాలలో ఊహించని మలుపులు సాధారణమే. జిన్ పింగ్ కనిపించకపోవడమే కొన్ని వార్తలకు బీజం కావొచ్చు. కానీ నిజమైన మార్పు జరిగితే, అది చైనా రాజకీయాల్లో పెద్ద తలకిందులే కావచ్చు.

# ట్రంప్‌పై దావా వేసిన 20 రాష్ట్రాలు!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. మెడిక్‌ఎయిడ్ ద్వారా సేవలు పొందుతున్న లక్షల మంది అమెరికా ప్రజల ప్రైవేటు ఆరోగ్య సమాచారాన్ని డిపోర్టేషన్ అధికారులకు అందించారని ఆరోపిస్తూ 20 రాష్ట్రాల అటార్నీ జనరళ్ల బృందం ట్రంప్‌పై సంయుక్తంగా దావా వేసింది.ఈ విషయాన్ని కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బోంటా మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ట్రంప్ పరిపాలన సమయంలో ఆరోగ్య శాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ సలహాదారులు, కాలిఫోర్నియా, ఇల్లినోయీ, వాషింగ్టన్, వాషింగ్టన్ డీసీ లాంటి రాష్ట్రాల నుండి మెడిక్‌ఎయిడ్ డేటాను అక్రమంగా హోంలాండ్ సెక్యూరిటీ అధికారులకు పంపించారని ఆరోపించారు.

**డేటాలో ఏం ఉన్నది?**

ఈ డేటాలో ఆరోగ్య రికార్డులు మాత్రమే కాకుండా, వ్యక్తుల పేర్లు, చిరునామాలు, సోషల్ సెక్యూరిటీ నంబర్లు, ఇమ్మిగ్రేషన్ స్థితి వంటి వ్యక్తిగత సమాచారమూ ఉన్నట్లు తెలుస్తోంది. ఇది తీవ్ర ఆందోళనకరమని, దీనివల్ల అక్రమంగా అమెరికాలో నివసిస్తున్న వలసదారులను గుర్తించి వారిని బలవంతంగా స్వదేశాలకు పంపించే అవకాశముందని న్యాయవాదులు హెచ్చరిస్తున్నారు.

**చట్ట ఉల్లంఘన**

ఈ చర్యలు ఫెడరల్ హెల్త్ ప్రైవసీ చట్టాలు.. ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్ పోర్టబిలిటీ అండ్ అకౌంటబిలిటీ యాక్ట్ ఉల్లంఘనకేనని అటార్నీ జనరళ్లు స్పష్టం చేశారు. HIPAA ప్రకారం.. వ్యక్తిగత ఆరోగ్య డేటాను ప్రైవసీ కింద రహస్యంగా ఉంచాలి. ప్రభుత్వ అవసరాల పేరుతో ఇలాంటివి ఇతర శాఖలకు ఇవ్వడం అనేది స్పష్టంగా చట్టవిరుద్ధమని వారు పేర్కొన్నారు.

**ప్రభావిత రాష్ట్రాలు & స్పందన**

ఈ చర్యల వల్ల ముఖ్యంగా వలసదారులు ఎక్కువగా నివసించే రాష్ట్రాలైన కాలిఫోర్నియా, ఇల్లినోయి, వాషింగ్టన్ ప్రభావితమయ్యాయి. ఈ రాష్ట్రాల్లో పౌరసత్వం లేకపోయినా, మెడిక్‌ఎయిడ్ కోసం అనేక మంది నామినేషన్ చేసుకుంటారు. అటువంటి వారి సమాచారాన్ని అక్రమంగా ఇతర శాఖలకు పంపించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ట్రంప్ పరిపాలనలో తీసుకున్న చర్యలు తరచూ వివాదాస్పదంగా మారడం కొత్తేం కాదు. అయితే ప్రజల ప్రైవసీకి సంబంధించిన ఇలాంటి చట్ట ఉల్లంఘనపై దేశవ్యాప్తంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ దావా ఎలా పరిణమించనుందో చూడాలి.

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

## బ్రేక్ తాత్కాలికమేనా?

బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. బనకచర్లకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. బనకచర్లకు పర్యావరణ అనుమతులు తిరస్కరించిన కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కార్ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తిప్పి పంపింది. అయితే ఇది తాత్కాలిక బ్రేకులా? లేక శాశ్వతంగా అనుమతులు ఇవ్వరా? అన్నది తేలాల్సి ఉంది. కానీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యానే బనకచర్లకు అనుమతులు ఇవ్వకోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. అందుకే ఏపీ ప్రభుత్వానికి చెందిన నేతలు మాత్రం ఇది తాత్కాలిక బ్రేకులేనని, ఖచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెబుతున్నారు.

**గేమ్ ఛేంజర్ గా భావించి...**

బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిని గేమ్ ఛేంజర్ గా చంద్రబాబు అభివర్ణించారు. గోదావరిలో వృధాగా తరలిపోయే నీటిని పోలవరం ప్రాజెక్టు ద్వారా కాల్వల ద్వారా రాయలసీమతో పాటు కోస్తాంధ్రలోని అన్ని జిల్లాలకు మళ్లించాలన్నది చంద్రబాబు ఆలోచన. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు కోసం ఎనభైవేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశార. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ, టీడీపీ కలసి ఉండటంతో సులువుగా అనుమతులు సాధించవచ్చని భావించి ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు.

**రాజకీయంగా అగ్గి రాజుకోవడంతో...**

అయితే బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణలో రాజకీయంగా అగ్గి రాజుకుంది. తమకు న్యాయంగా దక్కాల్సిన గోదావరి నీటిని అక్రమంగా ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుందని తెలంగాణలోని అన్ని పార్టీలు ఆందోళనకు దిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలసి వచ్చారు. మరొకవైపు తెలంగాణ బీజేపీ నేతలు కూడా పార్టీ నాయకత్వంపై వత్తిడి తెచ్చారు. బనకచర్లకు అనుమతులు మంజూరు చేస్తే ఆ ప్రభావం తెలంగాణ రాజకీయాల్లో పడే అవకాశముందని పార్టీ పెద్దలకు నచ్చచెప్పడంలో సక్సెస్ అయ్యారు. అందుకే పర్యావరణ అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర, అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది.

**అభ్యంతరాలు వ్యక్తం కావడంతో...**

తెలంగాణ నుంచి అనేక అభ్యంతరాలు ప్రాజెక్టుపై వ్యక్తమయ్యాయి. నీటి కేటాయింపులకు విరుద్ధమంటూ ఢిల్లీ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ గళమెత్తారు. వరద జలాలపై సమగ్ర అధ్యయనం చేయాలంటూ డిమాండ్ చేశారు. అందుకే ముందుగా అంతరాష్ట్ర అనుమతులు ప్రాజెక్టుకు పొందాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో నిధుల కేటాయింపు కూడా కష్టసాధ్యమవుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై పునరాలోచించే వీలుందని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతిస్తే తెలంగాణలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందని భావించి బ్రేకులు వేసిందన్నది వాస్తవం.

# నేరేడు పండు ప్రయోజనాల్లో మెండు..
# తెలిస్తే వదిలిపెట్టరు!

### మధుమేహులకు మేలు చేసే పండు ఇది
### ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సీ లభ్యం
### జీర్ణప్రక్రియ, గుండె పనితీరును పెంచుతుంది



వర్షాకాలంలో విరివిగా, చౌకగా లభించే పండ్లలో నేరేడు పండు ఒకటి. దీన్నే జామూన్ అని కూడా అంటారు. నల్లగా, నిగనిగలాడుతూ కనిపించే ఇవి రుచిలో అద్భుతంగా ఉంటాయి. రుచిలోనే కాదు పోషకాలు కూడా మెండుగా ఉంటాయి. ఏటా కనీసం ఓ రెండు నేరేడు పండ్లు అయినా తినాలని, దీనివల్ల కాలేయ శుద్ధి జరుగుతుందని పెద్దలు కూడా చెబుతుంటారు. అసలు నేరేడు పండ్లలో ప్రయోజనాలు గురించి తెలిస్తే వాటిని తినకుండా ఉండలేరు. ఈ పండ్లలో గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువ. కనుక మధుమేహులతోపాటు అందరూ హ్యాపీగా తినేయవచ్చు. ఇవి మధురంగానే ఉన్నప్పటికీ రక్తంలోకి చక్కెరలు వెంటనే విడుదల కావు. నిదానంగా విడుదల అవ్వడం వల్ల బ్లడ్ షుగర్ పెరగదు.

జామూన్ లో ఉండే జాంబోలిన్, ఎల్లాజిక్ యాసిడ్ ఇన్సులిన్ సెన్సిటివీని పెంచి బ్లడ్ షుగర్ ను నియంత్రిస్తాయి. టైప్ 1తోపాటు, టైప్2 డయాబెటిస్ కంట్రోల్ చేయడానికి ఇది మంచి పండు. జామూన్ లో యాంటీ ఆక్సిడెంట్లు అయిన యాంథోసియానిన్స్ ఉంటాయి. ఫ్రీరాడికల్స్ ను తొలగించడంలో ఇది సాయపడుతుంది. ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఇన్ ఫ్లమ్మేషన్ ను తగ్గిస్తుంది.

జామూన్ పాంక్రియాస్ ను స్టిమ్యులేట్ చేసి మరింత ఇన్సులిన్ ను ఉత్పత్తి చేస్తుందని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి. బ్లడ్ షుగర్ నియంత్రణకు ఇన్సులిన్ కీలకంగా పనిచేస్తుంది.

జామూన్ లోని బయో యాక్టివ్ కాంపౌండ్లు.. మధుమేహం కారణంగా తలెత్తే డయాబెటిక్ నెఫ్రోపతీ, డయాబెటిక్ రెటీనోపతి, న్యూరోపతి సమస్యల నియంత్రణకు సాయపడతాయి.

నేరేడు పండ్లలో జీర్ణప్రక్రియ సామర్థ్యాలను పెంచే గుణాలు ఉన్నాయి. కనుక జీర్ణ సంబంధ సమస్యలు ఉన్న వారు దీన్ని తినాలి.

వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలోనూ జామూన్ సాయపడుతుంది. ఎందుకుంటే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సీ కూడా లభిస్తుంది. దీన్ని రోజూ తినడం వల్ల వ్యాధులు, ఇన్ఫెక్షన్ల ముప్పు తగ్గుతుంది.

జామూన్ లో కేలరీలు చాలా తక్కువ. కనుక బరువు పెరగరు. పైగా బరువు తగ్గించుకోవాలని అనుకునేవారికి ఇదొక ఆప్షన్.

యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్ ఉండడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గించి, గుండెకు మేలు చేస్తుంది.

## గుండెపోటుకు ముఖ్య కారణం ఇదేనట..! తాజా అధ్యయనంలో వెల్లడి

**ఢిల్లీలోని జీబీ పంత్ ఆసుపత్రి వైద్యుల బృందం రీసెర్చ్**

**930 మంది హృద్రోగ బాధితులను పరిశీలించి రిపోర్ట్**

**అందులో 92 శాతం మంది ఒత్తిడితో బాధపడుతున్నట్లు వెల్లడి**



గుండెపోటు మరణాలతో పాటు హృద్రోగ సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రులలో చేరే వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా గుండెపోటుతో హఠాత్తుగా కుప్పకూలిపోతున్న సంఘటనలు పెరుగుతున్నాయి. దీనిపై ఢిల్లీలోని జీబీ పంత్ ఆసుపత్రి వైద్యుల బృందం చేసిన పరిశోధనలో గుండెపోటుకు ప్రధాన కారణం ఒత్తిడేనని తేలింది. తాజాగా జరిగిన ఈ పరిశోధనా ఫలితాలను ఇండియన్ హార్ట్ జర్నల్ ప్రచురించింది.

హృద్రోగ సమస్యలతో ఆసుపత్రిలో చేరిన రోగులపై జీబీ పంత్ ఆసుపత్రి వైద్యుల బృందం అధ్యయనం చేసింది. తీవ్రమైన, స్వల్ప గుండెపోటుతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరిన 903 మంది రోగుల ఆరోగ్య పరిస్థితిని నెల రోజుల పాటు శాస్త్రీయ పద్ధతిలో వైద్యులు పరిశీలించారు. రోగులలో మొత్తం 92 శాతం మంది ఒత్తిడితో బాధపడుతున్నట్లు తేలిందని చెప్పారు. వారిలో కొంతమంది అధిక ఒత్తిడితో మరికొందరు స్వల్ప స్థాయి ఒత్తిడితో బాధపడుతున్నారని తేల్చారు. మరీ ముఖ్యంగా ఒత్తిడితో బాధపడుతున్న వారిలో యువతే ఎక్కువగా ఉందని వివరించారు.

మారుతున్న జీవనశైలి వల్ల వ్యక్తిగతంగా, వృత్తిపరంగా చాలామంది ఒత్తిడితో బాధపడుతున్నారని, ఈ ఒత్తిడి గుండెపోటుకు దారితీస్తోందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ మోహిత్ గుప్తా వెల్లడించారు. గుండె పనితీరుపై ఒత్తిడి తీవ్ర ప్రభావం చూపిస్తోందని ఆయన వివరించారు. ఆసుపత్రిలో చేరిన రోగులలో ఎక్కువ మంది అక్యూట్ మయోకార్డియల్ ఇన్ఫారెక్షన్ (తీవ్రమైన గుండెపోటు)కు గురైనట్లు చెప్పారు.

ఇందులో 53 శాతం సివియర్ హార్ట్ ఎటాక్‌కు గురికాగా, 38 శాతం ఓ మోస్తరు గుండెపోటుకు గురైనట్లు పేర్కొంది. ఒత్తిడికి తద్వారా హృద్రోగ సమస్యలు పెరగడానికి ధూమపానం, మద్యపానం, వ్యాయామం లేకపోవడం, బీపీ, ఇన్సులిన్ తగ్గడం తదితర కారణమని ప్రొఫెసర్ డాక్టర్ మోహిత్ గుప్తా వివరించారు.

## ఈ సంకేతాలు ఉంటే.. మీరు ఆరోగ్యంగా ఉన్నట్టే

**ఉదయం నిద్ర లేవగానే ఉల్లాసంగా అనిపించాలి**

**భారంగా, బద్ధకంగా, అలసటగా ఉండకూడదు**

**కురులు, కంటి సమస్యలు కనిపించకూడదు**

**నెలవారీ రుతుక్రమం సరైన సమయానికి రావాలి**



నిజంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? ఎవరికి వారే దీన్ని తెలుసుకోవచ్చు. మనం ఎంత ఆరోగ్యవంతులమో మన శరీరమే చెబుతుంటుంది. ఆ సంకేతాలను పట్టుకుంటే చాలు సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఈ సంకేతాల ఆధారంగా అవసరమైతే జీవనశైలి, ఆహారంలో మార్పులు చేసుకోవచ్చు.

చక్కని ఆరోగ్యానికి మంచి నిద్ర ఎంతో అవసరం. మంచి నిద్ర అంటే.. ఉదయం లేచిన తర్వాత నీరసంగా, అలసటగా, బద్ధకంగా, అశక్తంగా అనిపించకూడదు. ఉదయం నిద్ర లేచిన తర్వాత ఉల్లాసంగా, ఎంతో హాయిగా ఉండాలి. అలా అనిపిస్తే నిద్ర సైకిల్ మెరుగ్గా ఉన్నట్టు అర్థం. తగినంత సమయం నిద్ర పోతున్నారని అర్థం. ఉదయం లేచిన తర్వాత ఉల్లాసంగా లేకపోతే, తగినంత సమయం నిద్ర పోతున్నదీ, లేనిదీ గమనించుకోవాలి. తగినంత సమయం నిద్రించినా కానీ, అసలటగా, మగతగా అనిపిస్తుంటే శారీరక శ్రమ, పోషకాహారం లోపించినట్టు అర్థం చేసుకోవచ్చు.

శిరోజాల సమస్యలు నేటి తరంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. అవి జన్యు సంబంధితం అని అనుకుంటుంటారు. కాలుష్యం అని భావిస్తుంటారు. పోషకాహారం లోపించినా, ఒత్తిడి ఎక్కువైనా శిరోజాలు రాలిపోతాయని గుర్తు పెట్టుకోవాలి. మీ శిరోజాలు ఆరోగ్యంగా ఉండి, జుట్టు రాలే సమస్య లేకపోతే ఆరోగ్యంగా ఉన్నట్టే. శరీరం నుంచి వ్యర్థాలు మూత్రం ద్వారా బయటకు పోతాయి. మూత్రం రంగు స్పష్టంగా ఉంటే శరీరంలో నీటి పరిమాణం తగినంత ఉన్నట్టుగా అర్థం చేసుకోవాలి. డీటాక్సిఫికేషన్ ప్రక్రియ సజావుగా సాగుతుందని అర్థం. మూత్రం లేత పసుపు లేదా పారదర్శక రంగు కాకుండా మరీ ముదురు పసుపు, ఇతర రంగుల్లో వస్తుంటే అనారోగ్య సమస్యలకు సూచికగా భావించొచ్చు.

రోజువారీ మల విసర్జన సాఫీగా సాగిపోవాలి. ఈ కార్యక్రమం కోసం కష్టపడకూడదు. దానంతట అదే సంకేతం వచ్చి, విసర్జనకు వెళ్లేట్టు ఉండాలి. ఏరోజుకారోజు పెద్ద పేగు నుంచి మలం మలాశయంలోకి వచ్చి విసర్జితం అవుతుంటే.. జీర్ణ వ్యవస్థ క్రియలు సాఫీగా సాగిపోతాయి. లేదంటే పొట్ట ఉబ్బరం, గ్యాస్ తదితర సమస్యలు వేధిస్తాయి.

రోజువారీ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకుంటూ.. వ్యాయామం కూడా చేసుకుంటూ ఉంటే, ఆ సమయంలో నొప్పులు, ఇతర ఇబ్బందులు లేకపోతే ఆరోగ్యంగా ఉన్నట్టు భావించొచ్చు. నోటి ఆరోగ్యం కూడా మొత్తం ఆరోగ్యంలో భాగం. నోటికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉండకూడదు. రోజులో రెండు సార్లు బ్రష్ చేసి, గార్గిలింగ్ చేసే వారికి ఈ సమస్యలు రావు. మహిళల్లో రుతుసరి (రుతు చక్రం) నెలవారీ క్రమం తప్పకుండా ఒకే సమయానికి వస్తుంటే వారు ఆరోగ్యంగా ఉన్నట్టుగానే భావించొచ్చు. రోజువారీ ప్రాణాయామం లేదా యోగా లేదా వాకింగ్ లేదా ఇతర వ్యాయామాలు చేసే క్రమం తప్పని అలవాటు ఉన్నవారు కూడా ఆరోగ్యంవంతులుగానే భావించొచ్చు. కళ్లు పొడిబారిపోవడం, కళ్లు ఎర్రబడడం, లేదా కంటి దురదలు వంటి సమస్యలు లేకపోతే కంటి ఆరోగ్యం సరిగ్గానే ఉన్నట్టు భావించాలి.

ఒక వయసు అంటే 40 ఏళ్లు దాటిన వారిలో మోకాలు, ఇతర కీళ్ల సమస్యలు కనిపించొచ్చు. కానీ, సమతులాహారం తీసుకుంటే, శారీరక, కండరాలు బలోపేతం అయ్యే వ్యాయామాలు చేస్తే ఇవి ఉండవు.

# ఇంకా సైలెంట్ మోడ్‌లోనే నేచురల్ స్టార్?



ఇటీవలి ఫోటోలలో భూమి పెడ్నేకర్ మెరిసింది



నేచురల్ స్టార్ నాని ఇటీవలే %-%హిట్:ది థర్డ్ కేస్%-%తో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. శైలేష్ కొలను తెరకెక్కించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి నాని కెరీర్‌లో మరో రూ.100 కోట్ల మూవీగా నిలిచింది. మే 1న ఐదు భాషల్లో విడుదలైన %-%హిట్ 3%-% ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. అక్కడ కూడా ఐదు భాషల్లో టాప్‌లో ట్రెండ్ కావడం తెలిసిందే. ఇదిలా ఉంటే ఈ సినిమా విడుదలై..ఓటీటీలోకి వచ్చేసినా నాని మాత్రం ఇప్పటికీ సైలెంట్ మోడ్‌లోనే ఉన్నాడు.

ఇది ఫ్యాన్స్‌ని కలవరానికి గురి చేస్తోంది. %-%హిట్ 3%-%తో బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన నాని అదే ఊపులో తదుపరి ప్రాజెక్ట్‌ని పట్టాలెక్కిస్తాడు అనుకుంటే సైలెంట్ మోడ్‌లోనే ఉండటం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ మూవీ తరువాత %-%దసరా%-% ఫేమ్ శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో నాని %-%ది ప్యారడైజ్%-% పేరుతో ఓ భారీ పాన్ ఇండయా సినిమాకు శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి గ్లింప్స్‌ని మూడు నెలల క్రితమే అంటే మార్చి 3న విడుదల చేశారు.

దీని కోసం ఏకంగా టీమ్ కోటీ ఖర్చు చేసినట్టుగా వార్తలు వినిపించాయి. సికింద్రాబాద్ లోని పారడైజ్ ఏరియాలో జరిగిన ఓ యాదార్ధ సంఘటన ఆధారంగా తెలంగాణకు చెందిన ఓ రచయిత రాసిన బుక్ ఆధారంగా ఈ సినిమాని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఓ వేశ్య కొడుకు కథగా, తల్లి పంతం కోసం ఓ కొడుకు చేసిన సమరం నేపథ్యంలో ఈ సినిమాని శ్రీకాంత్ ఓదెల సెట్స్ పైకి తీసుకెళ్లబోతున్నాడు. గత కొంత కాలంగా దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. %-%దసరా%-%ని నిర్మించిన సుధాకర్ చెరుకూరి నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ రా అండ్ రస్టిక్ కంటెంట్‌తో రూపొందబోతోందని ఇప్పటికే గ్లింప్స్‌లోని సన్నివేశాలు, డైలాగ్‌లతో స్పష్టమైంది. గ్లింప్స్ కారణంగా ఈ సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ప్రీ రిలీజ్ బిజినెస్‌తో పాటు నాన్ థియేట్రికల్ బిజినెస్ పరంగానూ భారీ డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఇంత వరకు దీని షూటింగ్‌కు సంబంధించిన అప్ డేట్ లేదేంటనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా నాని సైలెంట్ మోడ్‌ని వీడి ది ప్యారడైజ్ - షూటింగ్ అప్ డేట్‌ని ఇవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి నాని వారి మాటలు వింటున్నాడా? షూటింగ్ అప్ డేట్‌నిస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.

ఆకాంక్ష శర్మ స్లాగా గజల్ గుప్త కోచర్



# దుల్కర్ సల్మాన్ మరో తెలుగు సినిమా..?



మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తెలుగులో కూడా వరుస హిట్లతో దూసుకెళు న్నాడు. మహానటితో మెప్పించిన అతను ఆ నెక్స్ట్ సీతారామం తో సూపర్ హిట్ కొట్టాడు. ఇక లక్కీ భాస్కర్ తో మరో సూపర్ సక్సెస్ తన ఖాతాలో వేసుకున్నాడు. అదేంటో తన సొంత భాష మలయాళంలో కూడా దుల్కర్ కి ఇలాంటి క్రేజీ హిట్లు రాలేదు. అక్కడ సక్సెస్ కొట్టినా సరే ఈ రేంజ్ వసూళ్లను రాబట్టలేదు. దుల్కర్ సల్మాన్ తెలుగు సినిమా అంటే అది పక్కా హిట్ అనేంతగా క్రేజ్ తెచ్చుకున్నాడు.మహానటి, సీతారామం తోనే కాదు లక్కీ భాస్కర్ తో ఆ సెంటిమెంట్ మరింత బలపడింది. అందుకే దర్శక నిర్మాతలు దుల్కర్ తో సినిమాలకు రెడీ అవుతున్నారు. దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం కాంత సినిమా చేస్తున్నాడు. ఆ సినిమాలో రానా కూడా నటిస్తున్నాడు. మిస్టర్ బచ్చన్ బ్యూటీ భాగ్య శ్రీ హీరోయిన్ గా నటిస్తుంది. దుల్కర్ సల్మాన్ ఈ సినిమాతో కూడా మరో హిట్ టార్గెట్ పెట్టుకున్నాడు.ఇదిలా ఉంటే దుల్కర్ సల్మాన్ తో తెలుగు బడా నిర్మాత ఒకరు కొత్త సినిమా కోసం అప్రోచ్ అయినట్టు తెలుస్తుంది. ఐతే తెలుగు ఆఫర్ అంటే దుల్కర్ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాడు. అంతేకాదు ఆ సినిమా స్టోరీ కూడా సర్ ప్రైజింగ్ గా ఉందని తెలుస్తుంది. దుల్కర్ సల్మాన్ ఇప్పుడు ఏకంగా తెలుగు స్ట్రైట్ హీరోలానే సినిమాలు చేస్తున్నాడు. తీసిన మూడు సినిమాలు కూడా హిట్ అవ్వడంతో అతనికి టాలీవుడ్ లో మార్కెట్ కూడా బాగా పెరిగింది.సక్సెస్ ఫుల్ సినిమాలతో పాటు కథల విషయంలో దుల్కర్ క్లవర్ నెస్ ఆడియన్స్ ని మెప్పిస్తుంది. తప్పకుండా దుల్కర్ సల్మాన్ మరో అద్భుతమైన సినిమాలతో వస్తాడని చెప్పొచ్చు. మలయాళంలో దుల్కర్ చేస్తున్న ప్రయత్నాలు కూడా అతని ఇమేజ్ కి తగినట్టుగానే ఫలితాలు సాధిస్తున్నాయి. ఐతే బోనస్ గా తెలుగు మార్కెట్ దుల్కర్ క్రేజ్ ని డబుల్ చేసింది. ఐతే దుల్కర్ తో ఈసారి తెలుగు మేకర్స్ పాన్ ఇండియా లెవెల్ లో భారీ ప్రాజెక్ట్ ని ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. అది ఓకే అయితే మాత్రం తప్పకుండా దుల్కర్ కి అది మరో క్రేజీ సినిమా అయ్యేలా ఉందనిపిస్తుంది.